పబ్లిక్ వ్యూ
(PRGI NO: APTEL / 2023 / 88653)
తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

విలేకరులు కావలెను

తెలుగు పత్రికారంగంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న పబ్లిక్ వ్యూ తెలుగు దినపత్రికకు అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రిపోర్టర్లు కావలెను.

మీ రెజ్యూమ్ కింద వాట్సాప్ నెంబర్ కు పంపండి
9701132982

(PRGI NO: APTEL / 2023 / 88653)

# పబ్లిక్ వ్యూ

తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

సంపుటి : 2 సంచిక : 123 పేజీలు :8 సంపాదకులు : చిరికి లోకేశ్వరరావు ప్రచురణ : అనకాపల్లి మంగళవారం 20 జనవరి 2026 వెల : 5/-రూ॥

VOLUME :2 ISSUE :123 PAGES :8 EDITOR : CHIRIKI LOKESWARA RAO PUBLISHED FROM :ANAKAPALLI TUE 20 JANUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Kakinada,Eluru,Vijayawada,Guntur, Ongole, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## భారత్‌కు వచ్చే పెట్టుబడుల్లో..
# ఒక్క ఏపీకే 25 శాతం

- స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో సీఎం చంద్రబాబు బృందం భేటీ
- ఏపీకి స్విస్ పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా చర్చ
- టెక్నాలజీ, ఫార్మా రంగాల్లో భాగస్వామ్యానికి ఆహ్వానం
- విద్యా సంస్థల మధ్య సహకారంపైనా కీలక చర్చలు
- ఇండియా-జుఖీూా ఒప్పందంతో ఏపీకి ప్రయోజనమని లోకేశ్ ధీమా



పబ్లిక్ వ్యూ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు బృందం స్విట్జర్లాండ్ కు తరలివెళ్లింది. ఈ క్రమంలో వారు స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో జ్యూరిచ్‌లో సమావేశమయ్యారు. దీనిపై లోకేశ్ ట్వీట్ చేశారు. ఏపీ-స్విట్జర్లాండ్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు స్విస్ కంపెనీలను ప్రోత్సహించడంపై ఈ భేటీలో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు లోకేశ్ తెలిపారు.టెక్నాలజీ, మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రైల్వే, ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ వంటి కీలక రంగాల్లో స్విస్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను ఈ సందర్భంగా లోకేశ్ వివరించారు. పారిశ్రామిక రంగంతో పాటు విద్యా రంగంలోనూ సహకారంపై చర్చించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫార్మా, వైద్య పరికరాలు, స్టార్టప్‌ల రంగాల్లో స్విట్జర్లాండ్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో ఏపీలోని విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించారు. దీని ద్వారా ఏపీకి చెందిన నిపుణులు, విద్యార్థులు, తెలుగు ప్రవాసులకు మరిన్ని అవకాశాలు

లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఇటీవలే కుదిరిన ఇండియా-జుఖీూా (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, ఉద్యోగాలు, ఆవిష్కరణల పరంగా ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని మంత్రి లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ఏపీకి స్విస్ పెట్టుబడులు రావడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



## టీం 11 ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెడతారా?

- జ్యూరిచ్ లో తెలుగు డయాస్పొరా సమావేశం
- సీఎం చంద్రబాబుతో పాటు పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ఏపీకి రావొద్దని ఏడుపుగొట్టు టీం కంపెనీలకు ఈమెయిల్స్ పెడుతోందని విమర్శలు
- అర్థమైందా రాజా అంటూ పరోక్ష వ్యాఖ్యలు

పబ్లిక్ వ్యూ డెస్క్::"ఏపీలో ఉన్న టీం 11' ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి వస్తారా? అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ప్రశ్నించారు. పెట్టుబడుల కోసం తాము ప్రయత్నిస్తుంటే, ఏపీకి రావొద్దని ఆ 'ఏడుపుగొట్టు టీం' కంపెనీలకు ఈ-మెయిల్స్ పెడుతోందని ఆరోపించారు. కోడికత్తి, బాబాయి హత్య, ప్రజాధనంతో ప్యాలెస్ కట్టుకున్న క్రెడిట్ మాత్రమే వారికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్ వెళ్లిన ఆయన, జ్యూరిచ్ లో ఏపీఎన్‌ఆర్టీ ఆధ్వర్యంలో జరిగిన యూరప్ తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, పరోక్ష విమర్శలు గుప్పించారు."ఏపీలో టీం 11 ఉంది. అర్థమైందా రాజా? అదో ఏడుపుగొట్టు టీం. పెట్టుబడులు తీసుకువస్తామంటే ఏడుస్తారు. పెట్టుబడుల కోసం సింగపూర్ కు వెళితే.. ఏపీకి రావద్దని ఆ ఏడుపుగొట్టు టీం

- మిగతా 2లో...



## ఆ ఘటనలు చాలా వరకు
# మత ప్రమేయం లేనివే

గత ఏడాది తమ దేశంలో మైనారిటీలకు సంబంధించిన ఘటనల్లో చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగినవారు చేసినవే అని బంగ్లాదేశ్ పేర్కొంది. మతపరమైన ఉద్దేశాలు కారణం కాదని తెలిపింది. కొంతకాలంగా బంగ్లాదేశ్‌లో మైనారి టీలే లక్ష్యంగా జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలంటూ భారత్ ఒత్తిడి తీసుకొచ్చిన వేళ ఈ ప్రకటన వెలువడింది .మైనారిటీలకు సంబంధించి గతేడాది 645 ఘటనలు చోటుచేసుకున్నట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్

- మిగతా 2లో...



## ఆఫీస్‌లో రాసలీలలు..
### డీజీపీ ర్యాంకు అధికారి బాగోతం

- మహిళతో రాసలీలలు... తీవ్ర వివాదంలో కర్ణాటక డీసీఆర్‌ఈ డీజీపీ రామచంద్రరావు
- డీజీపీ స్థాయి అధికారి రామచంద్రరావు రాసలీలల వీడియోలు వైరల్
- ఆఫీసులోనే మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు
- అవి మార్ఫింగ్ వీడియోలని ఖండించిన డీజీపీ
- ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన సీఎం సిద్ధరామయ్య
- గతంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులోనూ డీజీపీపై ఆరోపణలు

- మిగతా 2లో...

## ఇరవై ఏళ్లుగా చెబుతున్నాం..
# ఇప్పుడు టైమొచ్చింది

- గ్రీన్ లాండ్ స్వాధీనంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తమ సూచనలను డెన్మార్క్ పెడచెవిన పెట్టిందని విమర్శ
- ఇన్నాళ్లుగా వేచి చూశాం.. ఇక తమ నియంత్రణలోకి తీసుకుంటామని వ్యాఖ్య

- మిగతా 2లో...





## తొలిరోజే వందేభారత్
# ట్రైన్‌లో చెత్త..

- ప్రతీ కోచ్ లో డస్ట్ బిన్ ఏర్పాటు.. అయినా సీటు దగ్గరే చెత్త పడేసిన ప్రయాణికులు
- వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఈ తప్పెవరిదంటూ ప్రశ్నించిన ఓ ప్రయాణికుడు
- సివిక్ సెన్స్ లేదంటూ తీవ్రంగా మండిపడుతున్న నెటిజన్లు

ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పిస్తుంటే వాటిని సరిగ్గా వాడుకోలేకపోతున్నాం.. కనీస బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాం.. అంటూ రైల్వే ప్రయాణికుడు ఒకరు సోషల్ మీడియాలో వాపోయాడు.

వివరాలు 2లో..

## కవిత కొత్త పార్టీ... రంగంలోకి
# ప్రశాంత్ కిశోర్!

- కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత అడుగులు
- వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలు
- తెలంగాణ జాగృతిని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటన
- మైనార్టీలు, బీసీలు, యువతకు తన పార్టీలో చేరాలని ఆహ్వానం



పబ్లిక్ వ్యూ డెస్క్:బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక, తన రాజకీయ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రయత్నాలను ఆమె ముమ్మరం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కార్యాచరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఆమెకు సహాయం అందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది.గత రెండు నెలల వ్యవధిలో ప్రశాంత్ కిశోర్ రెండుసార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. ఇటీవల సంక్రాంతి

- మిగతా 2లో...

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా
# నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

- ఉదయం పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నబీన్
- జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో అనివార్యమైన ఎన్నిక
- గత ఏడాది డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం



పబ్లిక్ వ్యూ డెస్క్:భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఁఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది.నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను

- మిగతా 2లో...

## వైసీపీ అధికారంలోకి రాగానే
# నారా లోకేశ్‌ను అరెస్ట్ చేస్తాం

- ఎన్టీఆర్ పై చంద్రబాబుకు గౌరవం లేదన్న లక్ష్మీపార్వతి
- ఎన్టీఆర్ కు భారతరత్న ఇప్పించడంలో వెనకడుగు వేస్తున్నారని మండిపాటు
- తమ ప్రభుత్వం రాగానే లోకేశ్ పై ఎంక్వైరీ కమిషన్ వేస్తామని వ్యాఖ్య



పబ్లిక్ వ్యూ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత లక్ష్మీపార్వతి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోసాలు, వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు కొత్తకాదని, ఇవన్నీ ఆయనకు అలవాటేనని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ పేరుతో రాజకీయాలు చేయడం తప్ప,

- మిగతా 2లో...

# ఇరవై ఏళ్లుగా చెబుతున్నాం.. ఇప్పుడు టైమొచ్చింది

గ్రీన్ లాండ్ విషయంలో గడిచిన ఇరవై సంవత్సరాలుగా డెన్మార్క్ ను నాటో హెచ్చరిస్తూనే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని చెబుతున్నా డెన్మార్క్ పట్టించుకోలేదని ఆరోపించారు. ఇరవై ఏళ్లుగా తాము వేచి చూస్తూనే ఉన్నామని చెబుతూ.. ఇప్పుడు తగిన చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చిందని అన్నారు.

గ్రీన్ లాండ్ స్వాధీనం విషయంలో తన వైఖరిని సమర్థించుకుంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. గ్రీన్ లాండ్ ను తమ నియంత్రణలోకి తెచ్చుకోవడం ఖాయమని ఆయన తేల్చిచెప్పారు. రష్యాను ఎదుర్కోవడంలో డెన్మార్క్ విఫలం కావడంతో భద్రతా కారణాల దృష్ట్యా తాము ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సమయం వచ్చింది కాబట్టే ఈ విషయంలో తాము కల్పించుకున్నామన్నారు. ఎలాగైనా గ్రీన్‌లాండ్ ను స్వాధీనం చేసుకుంటామంటూ ఆదివారం ట్రూత్ సోషల్ లో పోస్ట్ పెట్టారు. కాగా, ఈ విషయంలో తమ వైఖరిని వ్యతిరేకించే దేశాలపై టారిఫ్ లు విధిస్తామని హెచ్చరించిన ట్రంప్.. అన్నట్లుగానే ఈయూ కూటమిలోని 8 దేశాలపై 10 శాతం టారిఫ్ లు విధించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ టారిఫ్ లు అమలులోకి వస్తాయని ట్రంప్ స్పష్టం చేశారు.

## తొలిరోజే వందేభారత్ ట్రైన్‌లో చెత్త..

- మొదటి పేజి తరువాయి

వందే భారత్ స్లీపర్ ట్రైన్ లో తొలిరోజు ప్రయాణించిన విశేషాలు చెబుతూ.. ఓ కంపార్ట్ మెంట్లో తోటి ప్రయాణికులు పడేసిన చెత్తను వీడియోలో చూపిస్తూ ఇది ఎవరి తప్పని ప్రశ్నించాడు. కోట్లాది రూపాయల ఖర్చుతో ప్రీమియం స్లీపర్ క్లాస్ ట్రైన్ ను అందుబాటులోకి తీసుకొచ్చిన రైల్వే శాఖదా.. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలని ప్రయత్నించిన ప్రభుత్వానిదా.. అందుబాటులోకి వచ్చిన సదుపాయాన్ని సరిగ్గా వినియోగించుకోలేని మనదా.. ఎవరిది తప్పు? అంటూ నిలదీశాడు.

**అసలు ఏం జరిగిందంటే..**

హౌరా– గువాహటి మధ్య వందేభారత్ తొలి స్లీపర్ ట్రైన్ ను ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 17న ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు అందులో ప్రయాణించిన కొందరు ఐస్ క్రీం తినేసి కప్పులను, వాటర్ బాటిల్, టిష్యూ పేపర్లను సీటు వద్దే పడేశారు. దీంతో కంపార్ట్ మెంట్ చెత్తకుప్పలా మారింది. కొత్త రైలులో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినా వినియోగించుకోవాలనే తెలివి లేకుండా, కనీస బాధ్యత లేకుండా ప్రవర్తించారు.

ప్రతీ కోచ్ లో డస్ట్ బిన్ ఏర్పాటు చేసినా కూడా సీట్లో నుంచి లేచి డస్ట్ బిన్ వద్దకు నడవడానికి బద్దకించారు. సదరు కోచ్ లో ప్రయాణికుల నిర్వాకాన్ని తోటి ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. వైరల్ గా మారిన ఈ వీడియో చూసిన మనకు సివిక్ సెన్స్ అస్సలు లేదంటూ కామెంట్లు పెడుతున్నారు. పబ్లిక్ ప్రాపర్టీని శుభ్రంగా ఉంచుకోవాలనే కనీస స్పృహ లేదని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఆఫీస్‌లో రాసలీలలు..

### డీజీపీ ర్యాంకు అధికారి బాగోతం

కర్ణాటకలో డీజీపీ స్థాయి అధికారి కె.రామచంద్రరావు తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఓ మహిళతో రాసలీలల వీడియోలు పెను దుమారం రేపుతున్నాయి. తన కార్యాలయంలోనే ఓ మహిళతో అభ్యంతరకర రీతిలో ప్రవర్తించినట్లు ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను రామచంద్రరావు ఖండించారు. అవన్నీ మార్ఫింగ్ చేసిన వీడియోలని స్పష్టం చేశారు.గతంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులోనూ రామచంద్రరావుపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో అరెస్టయిన నటి రన్యా రావుకు ఈయన సవతి తండ్రి. ఈ కేసు నేపథ్యంలో 2025 మార్చిలో ప్రభుత్వం ఆయన్ను నిర్బంధ సెలవుపై పంపించి, ఇటీవలే తిరిగి విధుల్లోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఐజ=జు) డీజీపీగా పనిచేస్తున్నారు. కాగా, ఈ వీడియోల వ్యవహారంపై న్యాయవాదిని సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటానని రామచంద్రరావు మీడియాకు తెలిపారు.

సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వీడియోల్లో డీసీఆర్ఈ డీజీపీ రామచంద్రరావు యూనిఫాంలో ఉండగానే తన అధికారిక ఛాంబర్‌లో ఓ మహిళతో సన్నిహితంగా, అశ్లీల ప్రవర్తనతో కూడిన దృశ్యాలు ఉన్నాయి. ఒక క్లిప్‌లో ఆయన మహిళను ముద్దుపెట్టుకుంటుండగా, మరో వీడియోలో సూట్‌లో ఉండగా భారత జాతీయ పతాకం, పోలీసు శాఖ చిహ్నం ముందు ఇలాంటి ప్రవర్తనే కనబరిచారు. ఈ వీడియోల్లో మహిళ ముఖాన్ని బ్లర్ చేసి, నేపథ్య సంగీతం జోడించి సర్క్యులేట్ చేశారు.

ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు రామచంద్రరావు సోమవారం హోంమంత్రి జి. పరమేశ్వర కార్యాలయానికి వెళ్లారు. అయితే, ఆయనతో భేటీకి మంత్రి నిరాకరించినట్లు సమాచారం. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని హోం శాఖను ఆదేశించారని తెలిసింది.ఈ వీడియోలను ఏడాది క్రితమే చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, వీటిని ఇప్పుడు ఎందుకు విడుదల చేశారనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై మాజీ హోంమంత్రి ఆరగ జ్ఞానేంద్ర స్పందిస్తూ.. సీనియర్ అధికారి ఈ స్థాయికి దిగజారడం సిగ్గుచేటని, ఆయన పోలీసు శాఖను అవమానించారని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టీం 11 ముఖం చూసి ఎవరైనా పెట్టుబడులు పెడతారా?

- మొదటి పేజి తరువాయి

ఈ–మెయిల్స్ పెట్టే పరిస్థితి. కొన్ని కంపెనీలను కలిస్తే ఏపీకి రావొద్దంటూ వారికి కూడా ఈ–మెయిల్స్ పెడుతున్నారు. సీఎం చంద్రబాబు గారిని చూసి సదరు కంపెనీలు వస్తే మాత్రం క్రెడిట్ తీసుకోవాలనుకుంటారు. మళ్లీ క్రెడిట్ చోరీ అంటారు. టీం 11 ముఖం చూసి ఎవరైనా రాష్ట్రంలో పెట్టబడులు పెట్టడానికి వస్తారా? కోడికత్తికి వారికి క్రెడిట్ ఇవ్వాలి. బాబాయిని లేపేసిన క్రెడిట్ ఇవ్వాలి. చెల్లినీ, తల్లినీ గెంటేసిన క్రెడిట్ ఇవ్వాలి. రూ.700 కోట్ల ప్రజాధనంతో విశాఖలో ప్యాలస్ కట్టుకున్న క్రెడిట్ ఏడుపుగొట్టు టీంకి ఇవ్వాలి" అంటూ లోకేశ్ సెటైర్ల వర్షం కురిపించారు.గత 18 నెలల్లో ప్రజా ప్రభుత్వం రూ.23.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకుందని, దీని ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయని లోకేశ్ తెలిపారు. దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే రావడం గర్వకారణమని, పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఇప్పుడు నంబర్ 1 స్థానంలో ఉందని అన్నారు.తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడి, ఢిల్లీని సైతం దద్దరిల్లేలా చేసిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఆయన తెలుగుదేశం పార్టీని స్థాపించడం వల్లే తెలుగుజాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అభివృద్ధిని జోడించి రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని లోకేశ్ అన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు నేడు ఏపీ వైపు చూస్తున్నాయంటే దానికి కారణం 'బ్రాండ్ సీబీఎన్' అని స్పష్టం చేశారు.సీఎం చంద్రబాబుకు ఉన్న విజన్ కారణంగా ఆయన్ను ఏ విషయంలో అయినా గుడ్డిగా అనుసరించవచ్చని లోకేశ్ అన్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కొందరు విమర్శిస్తారని, కానీ భవిష్యత్తులో అవే అభివృద్ధి ఫలాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు జీపీఎస్ లాంటివారని, ఆయన నాయకత్వంలో తామంతా ఒక యంగ్ టీంగా ఎటువంటి ఈగోలు లేకుండా పనిచేస్తున్నామని తెలిపారు. ఆయన విజన్ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు.'బ్రాండ్ సీబీఎన్', 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని 'డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' వల్లే కంపెనీలు ఏపీకి క్యూ కడుతున్నాయని వివరించారు. గుజరాత్, ఒడిశా మాదిరిగా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు కొనసాగాలని ఆకాంక్షించారు.ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలా సాగుతున్నాయని, డీఎస్సీ పూర్తి చేయడం, కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించడం వంటి హామీలను నిలబెట్టుకున్నామని తెలిపారు.ఒకే రాజధాని అమరావతి, అభివృద్ధి వికేంద్రీకరణ తమ ప్రభుత్వ అజెండా అని స్పష్టం చేశారు. చిత్తూరు–కడపను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా, కర్నూలును రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా, ఉత్తరాంధ్రను ఫార్మా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని లేదా తాము పనిచేస్తున్న కంపెనీలను ఏపీకి తీసుకురావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి టీజీ భరత్, ఏపీఎన్ఆర్టీ అధ్యక్షుడు డా. వేమూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ అధికారంలోకి రాగానే

## నారా లోకేశ్‌ను అరెస్ట్ చేస్తాం

నిజంగా ఆయనపై ప్రేమ, గౌరవం చంద్రబాబుకు లేవని ఆరోపించారు.ఎన్టీఆర్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తామని ఇస్తున్న హామీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకేనని లక్ష్మీపార్వతి అన్నారు. ఇతర రాష్ట్రాల నాయకులు తమ రాష్ట్రానికి చెందిన మహనీయులకు భారతరత్న ఇప్పించేందుకు కేంద్రంపై పోరాటం చేస్తుంటే... ఎన్టీఆర్ లాంటి మహానాయకుడి విషయంలో చంద్రబాబు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. నిజంగా ఎన్టీఆర్‌పై గౌరవం ఉంటే, కేంద్రంపై ఒత్తిడి చేసి భారతరత్న ఇప్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో హత్యలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, దీనికి కూటమి ప్రభుత్వమే కారణమని అన్నారు. మంత్రి నారా లోకేశ్ పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, వైసీపీ అధికారంలోకి రాగానే ఆయనపై ఎంక్వైరీ కమిషన్ వేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. లోకేశ్ ను జైల్లో పెడతామని అన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని చెప్పారు. దుర్మార్గులకు అండగా నిలవడం అన్యాయమని, ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని లక్ష్మీపార్వతి పేర్కొన్నారు.

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

- మొదటి పేజి తరువాయి

పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## కవిత కొత్త పార్టీ... రంగంలోకి ప్రశాంత్ కిశోర్!

- మొదటి పేజి తరువాయి

పండుగ సందర్భంగా కూడా వీరి మధ్య భేటీ జరిగినట్లు తెలుస్తోంది. కొత్త పార్టీని ప్రకటిస్తే రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయి, పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, అనుసరించాల్సిన వ్యూహాలు వంటి కీలక అంశాలపై వీరిద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ సమావేశాలపై కవిత గానీ, తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.మరోవైపు తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకే కొత్త పార్టీ అవసరమని కవిత బలంగా వాదిస్తున్నారు. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చి, 2029 ఎన్నికల్లో ప్రజల పక్షాన పోటీ చేస్తామని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీ విధివిధానాల రూపకల్పనకు దాదాపు 50 కమిటీలతో అధ్యయనం చేయిస్తున్నారు. అదే సమయంలో మైనార్టీలు, బీసీలు, యువత తనతో కలిసి రావాలని, తన 'తెలంగాణ సెక్యులర్ పార్టీ'కి మద్దతివ్వాలని పిలుపునిస్తున్నారు.గతంలో ఏపీలో వైఎస్ జగన్‌కు, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్‌కు, వ్యూహకర్తగా పనిచేశారు. తమిళనాడులో నటుడు విజయ్ పార్టీకి కూడా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు కవితతో జతకట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు కవిత క్షేత్రస్థాయి సన్నాహాలు, మరోవైపు పీకే వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో త్వరలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ కొత్త రాజకీయ ప్రయోగం తెలంగాణలో ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## ఆ ఘటనలు చాలా వరకు మత ప్రమేయం లేనివే

- మొదటి పేజి తరువాయి

యూనస్ కార్యాలయం వెల్లడించింది. వాటిలో 71 ఘటనల్లో మతపరమైన కోణాలు ఉన్నట్లు పేర్కొంది. ఆలయాలపై దాడులకు సంబంధించి 38 ఘటనలు నమోదైనట్లు చెప్పింది. 71లో 50 ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారని, అంతే సంఖ్యలో నిందితులను అరెస్టు చేశారని వెల్లడించింది. మరో 21 ఘటనల్లో తగు చర్యలు తీసుకున్నారని తెలిపింది. అన్ని నేరాలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు బంగ్లాదేశ్ పేర్కొంది.

**బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య**

బంగ్లాదేశ్ గణాంకాలను బంగ్లాదేశ్ హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ (బీహెచ్‌బీసీయూసీ) ఖండించింది. ఇలాంటి ప్రకటనలు నేరస్థులను ప్రోత్సహించి, వారికి శిక్ష పడదనే భావనను కలిగిస్తాయని హెచ్చరించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో మూడు వారాల వ్యవధిలోనే 10 మందికిపైగా హిందువులు హత్యకు గురయ్యారు. దీంతో అక్కడ హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# సంపాదకీయం

## శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ

ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.. ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంతమందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించి, జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు సరిహద్దు గాంధీ. ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాద కరమైన వ్యక్తి అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. 'నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతికాముకుడు సరిహద్దు గాంధీ. బాద్షా ఖాన్ గా సరిహద్దు గాంధీ గా పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారమును పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఇతని అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. ఇతను పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారతదేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన పష్టూన్ స్వాతంత్ర్య కార్యకర్త. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అతను మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు మరియు మిత్రుడు, అయన భారతదేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత అతను జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు'. 'వేలాది అహింసా పఠాన్‌ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉట్మాన్జైలోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్–ఇ ఇస్లా–ఇ ఆఫ్ఘనియా' (ఆఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), మరియు 1927 లో యువ ఉద్యమమైన 'పాక్టున్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత , అతను పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్టున్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం యొక్క లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం ద్వారా మాత్రమే అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది, అతను 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసుకున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. వారు స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నారు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వారించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని మరియు ఖుదై ఖిద్మత్గర్, మరియు నేను మాత్రమే సేవ చేయాలనుకుంటున్నాను" అని చెప్పి గౌరవాన్ని తిరస్కరించారు. అతను చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడుతుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడమని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడటానికి ప్రతిజ్ఞ చేయమని ఒప్పించాడు. అతను ఈ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అతని "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సర్వర్లు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి ఒప్పించాడు.

బ్రిటీష్ పాలన ముగిసిన తరువాత భారతదేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మంది శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా నిరంతరం కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాదనే అవసరమైన నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్లో పాఠశాలలను తెరిచాడు, మహిళలను సమాజంలో ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చాడు మరియు తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రతిజ్ఞ చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయనాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లింలీడర్లు, ఇతను ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు.మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశారు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు. 'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. చివరకు మీరు మమ్మల్ని నక్కల పాలు చేశారు' అని సీడబ్ల్యూసీను ఉద్దేశించి ఖాన్ వ్యాఖ్యానించాడట. సరిహద్దు ప్రాంతవాసులకు ద్వేషి అయ్యాడు, అటు దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ లు తీవ్రంగా ద్రోహం చేశాయని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు" అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది

శాశ్వతంగా మిగిలిపోతుందని పిలుపునిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటూ పాకిస్థాన్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్గానిస్థాన్‌లోని కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చారు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచిపోయినట్లుగానే గాంధీని మరచిపోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి జీవించిన గఫర్ ఖాన్ పాకిస్థాన్‌లోని పెషావర్‌లో 1988, జనవరి 20వ తేదీన ఆయన మరణించారు.

# అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు





● జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి (కలెక్టరేట్ ), జనవరి 19:** భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని. పి జి ఆర్ ఎస్ కు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం-1 , 2 లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు లు వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా డివిజను, మండల, గ్రామస్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరయి ఆయా స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాల ని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని, గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్ లో 91 మరియు రెవిన్యూ క్లినిక్ లో 218 అర్జీలు మొత్తం 319 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు

కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి, బి జె ఆర్ ఎస్, ఎన్ ఎ ఓ బి, ఎ పి ఐ ఐ సి, ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, మనోరమ, రామ మాణి, అనిత, సిపిఓ జి.రామారావు, డ్వామా, మెప్మా, ఐ సి డి ఎస్, గృహనిర్మాణ పథక సంచాలకులు శిస్టు రవీంద్ర, కె సరోజినీ, సూర్య లక్ష్మి, శ్రీనివాస్, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి సుదీర్, జిల్లా సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు.




ఉచిత పశు ఆరోగ్య శిబిరాల గోడ, కర పత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి(పబ్లిక్ వ్యూ) జనవరి 19 :** జిల్లాలో పశు ఆరోగ్య శిబిరాలను ఈ నెల 19వ తేదీ నుంచి 31వ తేది వరకు నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాల గోడ,కర పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రంగంలో అభివృద్ధి సాధించాలంటే పశువులు ఆరోగ్యంగా ఉండాలన్నారు అప్పుడే ఉత్పాదకత పెరిగి రైతు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా జిల్లాలో ఈనెల 19వ తేదీ నుండి 31వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. పశు పోషకుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా జిల్లాలో 487 ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పశు పోషకులకు నాణ్యమైన వైద్య సేవలు, వ్యాధి నివారణ, అవగాహన కార్యక్రమాలు ఉచితంగా అందిస్తారన్నారు. ఈ శిబిరాల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పశు పోషణపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. పశువుల ఆరోగ్యం కాపాడడం, రైతులకు వైద్య ఖర్చుల భారం తగ్గించడం, ఉత్పాదకతను పెంచడమే ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో కోళ్ళకు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందిచడంతో పాటు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిబిరాలలో పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతుల పైన, పశు విజ్ఞానం పైన అవగాహన సదస్సులు, నిష్ణాతులైన పశువైద్యులతో నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. శాస్త్రీయ పశుయాజమాన్యం పరిశుభ్రత వలన పరిశుభ్రమైన పశు ఉత్పత్తుల ఉత్పత్తి, పశు గ్రాసాల వృధాని అరికట్టడం, వ్యాధుల వ్యాప్తి నియంత్రణ, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో సైతం లాభసాటి పశు యాజమాన్యం జరుగుతుందన్నారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో అనేక కార్యక్రమాలను రైతులకు వివరించడం జరుగుతుందని, పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కొరకు దగ్గర లోని పశు వైద్యశాలలు లేదా రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చున్నారు.

అనకాపల్లి జిల్లాలో 1,87,579 -ఆవులు, 2,03,524-గేదెలు, 1,80,424-గొర్రెలు, 1,99,479-మేకలు, మరియు 48,36,493-కోళ్లు ఉన్నాయన్నారు.

కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, జిల్లా పశు సంవర్ధక శాఖా అధికారి మోహన్ రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేయాలి





జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

**అనకాపల్లి,(పబ్లిక్ వ్యూ) జనవరి 19 :** జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కాగా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను, పరీక్షా కేంద్రాలలో వేసవికాలం దృష్ట్యా పరిశుభ్రమైన తాగునీరు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలని, పరీక్షా పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేయుటలో సిట్టింగు, ఫ్లయింగు స్క్వాడ్లు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపించుటకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనులను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు.

జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషను అధికారి ఎం. వినోద్ బాబు ఇంటర్మీడియెట్ పరీక్షల వివరాలు తెలియజేస్తూ 23.02.2026 నుండి 24.03.2026 వరకు ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు, 24.02.2026 నుండి 23.03.2026 వరకు ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు వరకు రెండవ సంవత్సరం విద్యార్థులకు వేర్వేరు రోజులలో పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లాలో 34 సెంటర్లు ఏర్పాటుచేయడం జరిగిందని విద్యార్థులు పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాలలోనికి సెల్ ఫోనులు నిషేదమని, విద్యార్థులతో పాటు, సిబ్బంది ఎవరూ పరీక్షా కేంద్రంలోనికి తీసురాకూడదని తెలియజేశారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేయుటకు ఫ్లయింగ్ స్కాడలను, సిట్టింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ వై. సత్యనారాయణరావు , జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎం హైమావతి, ఆర్.టి.సి.డిపోమేనేజరు వి ప్రవీణ , జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు. పోలీస్ డిపార్ట్మెంట్ మోహన్ రావు. పోస్టల్ డిపార్ట్మెంట్ కే వంశీకృష్ణ, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ , జీవీఎంసీ డిపార్ట్మెంట్, ఫైర్ డిపార్ట్మెంట్ తదితర అధికారులు హాజరయ్యారు.

## విద్యుత్ చార్జీలపై 20 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

**అనకాపల్లి(పబ్లిక్ వ్యూ), జనవరి 19:** విద్యుత్ చార్జీల (టారిఫ్) పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపిఈఆర్సి) ఈ నెల 20 నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీరు గొప్పు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపిఈఆర్సి చైర్మన్ పి.వి. ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తిరుపతి, విజయవాడ, కర్నూలు లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలు ఏపిఈఆర్సికి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) పై 20వ తేదీన తిరుపతి లో, 22,23 తేదీల్లో విజయవాడ, 27న కర్నూలులో రోజు ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు (వ్యక్తిగతంగా), రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) జరుగుతాయన్నారు. ఏపిఈఆర్సి అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇందనశాఖ, ఏపీట్రాన్స్ కో, ఏపీజెన్కో, ఏపీఈపీడిసియల్, ఏపీఎస్పీడిసియల్, ఏపీసిపీడిసియల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతీరోజు మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్ కు సంబందించిన ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తారని వివరించారు. అభిప్రాయాలు చెప్పదలుచుకున్న వారికి (1) అనకాపల్లి జిల్లా పర్యవేక్షక్ ఇంజినీరు వారి కార్యాలయం లేదా (2) కార్యనిర్వాహక ఇంజినీరు వారి కార్యాలయం, కశింకోట లేదా (3) కార్యనిర్వాహక ఇంజినీరు వారి కార్యాలయం, నర్సీపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోనివారు కూడా విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో అభిప్రాయాలు తెలియచేయవచ్చన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా వీడియో కాన్ఫరెన్స్ ప్రతక్ష ప్రసారం లింకు https://www.eliveevents.com/aperc2026 ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ వినియోగదారులు, ప్రజా ప్రతినిధులు, సంబందిత సంస్థలు, ఈ విచారణల్లో ప్రత్యక్షముగా కాని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనుటకు జిల్లా పర్యవేక్షక్ ఇంజినీరు వారి కార్యాలయం, అనకాపల్లి - 9440816377, కార్యనిర్వాహక ఇంజినీరు వారి కార్యాలయం, కశింకోట- 9440816352, కార్యనిర్వాహక ఇంజినీరు వారి కార్యాలయం, నర్సీపట్నం - 9491049790 కార్యాలయములలో సంప్రదించగలరని విజ్ఞప్తి చేసారు.

## సఖి వన్ స్టాప్ సెంటర్ వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**అనకాపల్లి, (పబ్లిక్ వ్యూ), జనవరి 19**; సోమవారం ఉదయం కలెక్టరేట్ ఆవరణలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి లో నిర్వహిస్తున్న సఖి వన్ స్టా ప్ సెంటర్ కు కేటాయించిన ప్రత్యేక వాహనాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు మరియు బాలికలు ఎదుర్కొనే హింస, వేధింపులు, వివక్ష వంటి సమస్యలకు తక్షణ సేవలు అందించడంలో సఖి వన్ స్టాప్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈ వాహనం ద్వారా బాధితులకు తక్షణ చేరువ, కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, న్యాయ సహాయం వంటి సేవలను వేగవంతంగా అందించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు ఎస్ సూర్య లక్ష్మి,

సీనియర్ అసిస్టెంట్ మోహినుద్దీన్, సబ్ ఇన్స్పెక్టర్ రాములమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## మండల స్థాయి సర్పంచ్ కప్ వాలీబాల్ పోటీలు ప్రారంభించిన పళ్ళ నాగమణి.



**పరవాడ (పబ్లిక్ వ్యూ) జనవరి 19 :** మండలం పెద్దముషిడివాడా పంచాయతీ పరిధిలో మంగళవారం జరగబోవు రాములవారి తీర్థ మహోత్సవం సందర్భంగా గ్రామంలో మండలస్థాయి సర్పంచ్ కప్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని రాడ్ బాయ్స్ కమిటీ సభ్యులు తెలిపారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి హాజరై రాముల వారి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుండి మొత్తం 20 టీమ్ లు పాల్గొన్నాయి అని అందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి గా 10000 రూ,రెండోవ బహుమతి గా రూ 5000,మూడవ బహుమతి గా రూ 3000 అందచేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లా అప్పారావు (కబడ్డీ)

కలవలపల్లి సత్యనారాయణ, ఎలమర్తి బుజ్జి, కేదర్శెట్టి రాజేష్, పిల్ల చిట్టిబాబు, బంధం వెంకటరమణ,నందవరపు శ్రీనివాస్, పల్లా పైడిరాజు, బర్ల వెంకయ్య నాయుడు, పల్లా పెద్దబ్బాయి, నారపీని శ్రీనివాస్, దాలిపోయిన పైడిరాజు, ఉరుకుటి సింహాచలం, సునీల్ జోషి, గున్నూరు నాగార్జున, పిల్ల బాబి, ఉప్పులూరు శ్రీను, జన్నార్పు ప్రవీణ్, మారేడుపూడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ జిల్లా నూతన జే సీ గా గొబ్బిళ్ల విద్యాధరి బాధ్యతలు స్వీకరణ



**విశాఖపట్నం (పబ్లిక్ వ్యూ) జనవరి 19:**విశాఖపట్నం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన గొబ్బిళ్ల విద్యాధరి సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పరిపాలనకు సంబంధించిన కీలక అంశాలపై అధికారులతో సంక్షిప్తంగా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యత ఇస్తూ పని చేస్తానని స్పష్టం చేశారు.

ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా భూ పరిపాలన, రెవెన్యూ సమస్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. అలాగే జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది జాయింట్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు తన అనుభవం, సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తానని గొబ్బిళ్ల విద్యాధరి ఈ సందర్భంగా భరోసా వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఆరిపోయిన యువ జీవితం

### బీబీఏ విద్యార్థి శశాంక్ మృతి




**విశాఖ తూర్పు,(పబ్లిక్ వ్యూ) జనవరి 19:**తల్లిదండ్రుల ఆశలు, కళాశాల కలలు, భవిష్యత్ ఆశయాలుడ అన్నీ ఒక్కసారిగా రోడ్డుపై ఆగిపోయాయి. ఓల్డ్ డైరీ ఫార్మ్ విశాఖ వ్యాలీ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఋషికొండ గాయత్రీ కళాశాలలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శశాంక్ (20) మృత్యువాత పడ్డాడు.

విశాఖ వ్యాలీ జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిని దాటేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, డైరీ ఫార్మ్ నుంచి ఎండాడ వైపు వెళ్తున్న గీతం కళాశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం శశాంక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శశాంక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ ధర్మేంద్ర తెలిపారు.

ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న విద్యార్థులకు కూడా గాయాలు కాగా, వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శశాంక్ మృతి వార్త తెలుసుకున్న వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు, కళాశాల విద్యార్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. చదువులో మంచి ప్రతిభ చూపుతున్న శశాంక్ భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుతాడనే ఆశతో ఉన్న తల్లిదండ్రుల కలలు ఈ ప్రమాదంతో ఛిన్నాభిన్నమయ్యాయి. ఘటన స్థలంలో విద్యార్థులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

తరచూ ప్రమాదాలు జరుగుతున్న విశాఖ వ్యాలీ జంక్షన్ వద్ద రోడ్డు భద్రత చర్యలు తీసుకోవాలని, పాదచారుల కోసం సురక్షిత మార్గాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం ఎలా ఒక కుటుంబాన్ని శాశ్వత విషాదంలోకి నెట్టేస్తుందో ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

## జిల్లా జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు




**శ్రీకాకుళం, (పబ్లిక్ వ్యూ) జనవరి 19:**జిల్లా కారాగారంలోని ఖైదీలు తమ ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు సూచించారు. సోమవారం ఆయన జిల్లా జైలును ఆకస్మికంగా తనిఖీ చేసి ఖైదీలతో నేరుగా మాట్లాడారు.

ఈ సందర్భంగా ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ, న్యాయవాది లేని ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ తరపున ఉచిత న్యాయ సేవలు అందించేందుకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. జైలులో ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వంటశాల, ఆహార గదుల పరిశీలన

తనిఖీ అనంతరం జైలులోని వంటశాల, ఆహార పదార్థాల నిల్వ గదులను నిశితంగా పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న భోజన నాణ్యత, తాగునీటి సదుపాయం, వైద్య సేవలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు.

నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలి

కారాగారంలో ఖైదీలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలని జైలు అధికారులకు సూచించారు. ఖైదీల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి .

### సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు.



**పరవాడ(పబ్లిక్ వ్యూ) జనవరి 19.** మండల కేంద్రమైన పరవాడలో ఉపాధి హామీ కార్మికులతో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టాన్ని పునర్దించాలని డిమాండ్ చేస్తూ గోడ పత్రిక ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిని దెబ్బ కొట్టే కొత్త చట్టాన్ని వ్యతిరేకించాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు ఈనెల 18 నుండి 21 వరకు గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల చట్టాన్ని మార్పును వ్యతిరేకిస్తూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు రుతుదారులకు ఆకలి చావుల నివారణకు వలసలు తగ్గించడానికి తోడ్పడిన 2005 మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేస్తుందని ఈ విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన కొత్త చట్టం ఉపాధి హామీ కార్మికుల హక్కును దెబ్బతీస్తుందని అన్నారు. కార్పొరేట్ల ఒత్తిడితోనే ఈ కొత్త చట్టం తీసుకొచ్చారని అన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ కార్మికులకు పొట్ట కొట్టే చర్యలకు మోడీ ప్రభుత్వం కుట్ర పండిందని అన్నారు. నూతన చట్టం వలన 40 శాతం రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం 60% ఉపాదా మీ నిధులు విడుదల చేయడం వలన రాష్ట్రాలపై భారం పడుతుందన్నారు. ఇప్పటివరకు 90% కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం 10% ఖర్చు చేస్తే సరిపోలేదని భవిష్యత్తులో దీనివలన రాష్ట్రాలు పై భారం పడడం వలన పథకం అమలకు మంగళం పాడే ప్రమాదం ఉందన్నారు. మోడీ సత్యనారాయణ 2025 చట్టాన్ని రద్దు చేయాలని రద్దు చేయాలని 2005లో తెచ్చిన చట్టాన్ని పునర్దించాలని డిమాండ్ చేశారు. ఈ పథకం అమలు కోసం గ్రామ గ్రామాన ప్రజలను ఇంటింటికి సిపిఎం నాయకులు కార్యకర్తలు కూలీలు రైతులతో పాటు కార్మికులు విద్యార్థులు యువకులను మహిళలు ను మోడీ తెచ్చిన ఈ కొత్త చట్టానికి వ్యతిరేకంగా జరుగు ఉద్యమంలో భాగస్వామ చేస్తామని కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో గని శెట్టి సత్యనారాయణ, పార్వతి, సన్యాసిరావు, అప్పారావు, రామలక్ష్మి, సన్యాసమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి






### జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

**అనకాపల్లి(పబ్లిక్ వ్యూ) జనవరి 19:** గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీచేసారు. జనవరి 26న స్థానిక ఎన్.టి.ఆర్. స్టేడియంలో వేడుకల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రోటోకాల్, సంప్రదాయం ప్రకారం అందరినీ ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబిస్తూ శకటాలను తీర్చిదిద్దాలని, స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మైదానం సిద్ధం చేయాలని, అక్కడ అలంకరణ ఏర్పాట్లు చేయాలని, వీఐపీ, వీవీఐపీలు కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాట్లు, సాధారణ పౌరులు వేడుకలను వీక్షించేందుకు అనువుగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. పి.ఎ. సిస్టమ్, శానిటేషన్ నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. బహుమతుల అందజేత, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, గీతాలపన, ప్రగతి నివేదిక తదితర కార్యక్రమాల ఏర్పాట్లలో అధికారులంతా సమన్వయంతో వ్యవహరించాలని, పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు.

సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ గుండ. అప్పల సూర్యనారాయణ కుటుంబానికి పరామర్శ

### అంగన్వాడీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి మంత్రి గుమ్మడి సంధ్యారాణి






**శ్రీకాకుళం, (పబ్లిక్ వ్యూ) జనవరి 19:**ఇటీవల స్వర్గస్తులైన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి శ్రీ గుండ. అప్పల సూర్యనారాయణ కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అనంతరం జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారిత శాఖ కార్యాలయంలో మంత్రి అంగన్వాడీ వ్యవస్థపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యాలయ సిబ్బంది, సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, చిన్నారుల తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలను అంగన్వాడీలకు పంపుతున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ప్రతి అంగన్వాడీ టీచర్‌పై ఉందని స్పష్టం చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలోనూ, విద్యాబోధనలోనూ మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందడుగు వేసిందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే అనేక సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 55,706 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ.11,500 వేతనం చెల్లిస్తున్నట్లు తెలిపారు. వేతనాలు పెంచిన కారణంగా కొన్ని సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, నెలకు రూ.10 వేల ఆదాయం దాటితే పథకాలు వర్తించని అంశాన్ని గౌరవ ముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని తెలిపారు.

పదవ తరగతి ఉత్తీర్ణత కలిగిన 5,000 మందిని అంగన్వాడీ టీచర్లుగా నియమించామని మంత్రి వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు, పాలు, పౌష్టికాహారంలో నాణ్యత లోపాలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాలకు ఎలక్ట్రికల్ గ్యాస్ స్టౌవ్‌లు సరఫరా చేసినట్లు తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ, మట్టి ఖర్చులు వంటి సదుపాయాలు కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. గిరిజన హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నామని, గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణంలో ఉత్తరాంధ్ర ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. డోలుమోత సహాయంతో వెళ్లే పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొరై, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ సాధికారత అధికారి ఐ. విమల, సీడీపీఓలు, సూపర్వైజర్లు, శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజార్ రైతులకు హెల్త్ ఇన్సూరెన్స్ తప్పనిసరి

### రైతు బజార్ పనితీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన:ఐ ఎస్ ఓ శివయ్య

**విశాఖ తూర్పు, (పబ్లిక్ వ్యూ) జనవరి 19:**నగరంలోని ఎంవీపీ కాలనీ రైతు బజార్ను సోమవారం ఐఎస్ఒ శివయ్య సందర్శించి,పరిశీలించారు. ఈ పర్యటనలో రైతు బజార్ పరిసరాలను,ఆర్వో వాటర్ ప్లాంట్,టాయిలెట్స్ మెంటైనేన్స్ ను పరిశీలించిన ఆయన సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.రైతు బజార్ కార్యాలయంలో ఉన్న రికార్డులను తనిఖీ చేసారు. రైతు బజార్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని,రైతులను, వినియోగ దారులను కోరారు. రైతులు,డ్వాక్రా సంఘాల సభ్యులతోను ఆయన మాట్లాడి రైతు బజార్ సమస్యలు సూచనలను రైతులను అడిగి ఆయన తెలుసుకున్నారు. రైతులందరికీ ముందు చూపుతో హెల్త్ ఇన్సూరెన్స్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు సహాయకుడు కనక రాజు,తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలు.





**ఆటో కార్ లారీ వ్యన్ ద్విచక్ర వాహనాదారులకు అవగాహన.**

**తాడేపల్లిగూడెం, (పబ్లిక్ వ్యూ) జనవరి 19.**తాడేపల్లిగూడెం రవాణా కార్యాలయంలో పరిధి లో ఉన్న వాహనాలు నడిపే వారికి ప్రతి ఒక్కరికీ రవాణా భద్రత నియమాలను పాటించాలి. మోటార్ వేవికల్ ఇన్స్పెక్టర్, యూనిట్ కార్యలయం లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సిబ్బంది తో కలిసి ఆటో కార్ లారీ ట్రాక్టర్ వ్యన్ ద్విచక్ర వాహనాదారులకు అవగాహనా కల్పించారు. తగిన సూచనాలు తెలియజేసారు.
పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ,రవాణా శాఖ అధికారి వారి ఆదేశాలతో 37వ జాతీయ రహదారి భద్రత మాస. ఉత్సవాలు 1.01.2026 నుండి 31.01.2026 జరుగుతున్నాయి అని అన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు అని తెలిపారు. లైట్ మోటార్ వైవికల్ నడుపు వాహనదారులు సీట్ బైల్ట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ ప్రమాదలు కొని తెచ్చుకోవద్దని తెలియజేసారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు చిన్న పిల్లలు 18 సంవత్సరాల వయస్సు దాటినా పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు మోటార్ వైవికల్ ఇన్స్పెక్టర్ నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## పెంట్లమ్మ తల్లి జాతరకు లక్ష రూపాయాల విరాళం.

## వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్





**తాడేపల్లిగూడెం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19**పెంట్లమ్మ జాతరకు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి వడ్డె రఘురామ్ లక్ష రూపాయలు విరాళం. పెంటపాడు మండలంలోని కాస్పా పెంటపాడు గ్రామంలో వేసి ఉన్న శ్రీ పెంట్లమ్మ తల్లి గుడిలో జరుగుతున్న సేవా కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన ఆలయ కమిటీ చైర్మన్ సాగర్ నరాల శెట్టి సంతోష్ గ్రామ సర్పంచ్ పీతలు సత్యనారాయణ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం చేసుకొని అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాబోయే అమ్మవారి జాతరకు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మేడపరెడ్డి బొమ్మి నాయుడు నల్లమిల్లి అంజిరెడ్డి, దొడ్డికర్ల చంద్రయ్య, బేతాళ నాని మరియు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు

## మనిషి మారితే సమాజం మారుతుంది

### తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ



**రాజమహేంద్రవరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19**:సమ సమాజ నిర్మాణానికి తన జీవితాన్నే అంకితం చేసిన మహానుభావుడు, తత్వవేత్త మహాయోగి వేమన జయంతి సందర్భంగా, జిల్లా పోలీస్ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ పూలమాలలు వేసి
నివాళులర్పించారు. మహయోగి వేమన జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నేటి యువత వేమన చెప్పిన 108 శతక పద్యాల నుంచి తీసుకోవాల్సిన సారాంశాలను ఒకే వాక్యంలో చెబుతూ మనిషి మారితే సమాజం మారుతుందని జిల్లా ఎస్పీ అభిప్రాయపడ్డారు.మూఢనమ్మకాలకు యువత బానిస కాకూడదని, యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని వేమన బోధించిన సామాజిక న్యాయమన్నారు. వేమన దృష్టిలో సద్గుణమే నిజమైన సంపదని, స్త్రీని అణగదొక్కే సమాజాన్ని ఆయన తీవ్రంగా ఖండించారన్నారు. వేమన జయంతి సందర్భంగా నేటి యువతియువకులు సంకల్పం చేయాలని ఎస్పీ సూచించారు.
కులవివక్షకు వ్యతిరేకంగా నిలబడతామని, అంధ విశ్వాసాలను తిరస్కరిస్తామని, స్త్రీ గౌరవాన్ని కాపాడతామని, అవినీతికి దూరంగా ఉంటామని. ప్రశ్నించే పౌరులమవుతామని, సోషల్ మీడియాలో కుల ఘర్షణలు కాదని,సామాజిక ఐక్యతను నిర్మిస్తామని
వేమనకు నిజమైన నివాళి అని ఎస్పీ హితవు పలికారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి (ఎస్ బి) బి. రామకృష్ణ , ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొని యోగివేమన చిత్రపటానికి నివాళు లర్పించారు.

# డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం 68వ పాలకమండలి సమావేశం




**తాడేపల్లిగూడెం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19.** డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం 68వ పాలకమండలి సమావేశం రాష్ట్ర సచివాలయంలో, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కె.ధనుంజయరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఐఎఎస్, ఆర్థిక శాఖ కార్యదర్శి తరుపున ఉప కార్యదర్శి, ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. శారద జయలక్ష్మి గారు మరియు వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డా. జె. రమణ, రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాస్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా మరియు డా. వైఎస్ ర్ ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. ఏం. మాధవి నాన్ మెంబర్ కార్యదర్శి గా హాజరై, అనేక అంశాలు చర్చించి, సమీక్షించి, విధాన నిర్ణయాలు తీసుకొన్నారు.

**ముఖ్య నిర్ణయాలు:**

1. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆలోచన అనుసరించి రూపొందిన "స్వర్ణాంధ్రవిజన్ 2047" లో ఉద్యాన రంగానికి మంచి ప్రాధాన్యతనిచ్చారు . ఈ క్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం చేపట్టే పరిశోధనా కార్యక్రమాలు, విస్తరణ కార్యక్రమాలు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ, విజన్ లక్ష్యాలకు అనుసంధానం చేయాలి.
2. రాయలసీమ ఉద్యాన హబ్ గా గుర్తించబడే క్రమంలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని నిర్ణయం చేశారు.
3. ఉద్యాన పంటల విస్తీర్ణం పెరిగేలా అవసరమైన అవగాహనా కార్యక్రమాలు, నిర్వహించాలని నిర్ణయం
4. ఉద్యాన విశ్వవిద్యాలయం అధ్యాపకులకు, శాస్త్రవేత్తలకుపెండింగ్ లో ఉన్న పదోన్నతులకు ఆమోదం.
5. ఉద్యాన పంటల వారీగా, శాస్త్రవేత్తలను వర్గీకరించి, పంట యాజమాన్య పద్ధతుల పై విస్తృత పరిశోధనా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణఇచ్చారు.
6. ఉద్యాన విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమం
7. పెండింగ్ లో ఉన్న మౌలిక వసతుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడం.

## డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ క్యాపిటల్ ఓవర్‌హాల్



**రూ.30 లక్షలతో పనులు చేపట్టిన ఏపీ జెన్‌కో**

గూడెం కొత్త వీధి/డొంకరాయి, (పబ్లిక్ వ్యూ) జనవరి 19:సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో ఉన్న 25 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్‌కు ఏపీ జెన్‌కో అధికారులు క్యాపిటల్ ఓవర్‌హాల్ పనులు చేపట్టారు. తరచూ మరమ్మతులకు గురవుతున్న ఈ యూనిట్ పనితీరు మెరుగుపర్చేందుకు రూ.30 లక్షల అంచనా వ్యయంతో ఓవర్‌హాల్‌కు ప్రతిపాదనలు పంపగా, విజయవాడలోని ఏపీ జెన్‌కో హెడ్‌క్వార్టర్స్ (విద్యుత్ సౌధా) నుంచి అనుమతులు లభించాయి.ఈ మేరకు టెండర్లు పిలవగా, శ్రీ అభిరామి ఇంజినీరింగ్ కంపెనీ పనులు దక్కించుకుంది. ప్రస్తుతం సంస్థ డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ క్యాపిటల్ ఓవర్‌హాల్ పనులను చురుగ్గా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా యూనిట్‌లోని రోటార్‌ను బయటకు తీసినట్లు అధికారులు తెలిపారు. అలాగే యూనిట్ రన్నర్‌లో లీకేజీలు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు.ప్రస్తుతం యూనిట్‌కు సంబంధించిన భాగాలను విడదీసే ప్రక్రియ కొనసాగుతోందని, అన్ని పార్టులను పూర్తిగా బయటకు తీసిన అనంతరం వాటి పరిస్థితి, లోపాలను పరిశీలించి ఓవర్‌హాల్ పనులకు ఎంత సమయం పడుతుందో స్పష్టత వస్తుందని డొంకరాయి డీఈ బాస్కరరావు తెలిపారు.

# రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి



- డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెంట్ తప్పనిసరి.
- ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఎస్సై పి నాని.

**ముంచంగిపుట్టు, (పబ్లిక్ వ్యూ) జనవరి 19.**రహదారి భద్రతపై వాహనదారులు అవగాహన తప్పనిసరి కలిగి ఉండాలని ముంచంగిపుట్టు ఎస్సై పి నాని అన్నారు. మండల కేంద్రంలో గల నాలుగు రోడ్ల కూడలి వద్ద సోమవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జి.మాడుగుల సీఐ శ్రీనివాస్ సూచనలతో మండలంలో గల వివిధ గ్రామాల యువతకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలనీ, రోడ్డు ప్రమాదాలు నివారించాలని సూచించారు. వాహన తనిఖీలో వాహన యజమానుల వద్ద రికార్డులను క్షుణ్ణంగా పరిశీలన చేసి ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్స్ ధరించి వాహనలు నడపాలని ఆయన అన్నారు. ఈ మధ్య కాలంలో ద్విచక్ర వాహనల ప్రమాదాల కారణంగా అనేక మందికి తీవ్ర గాయాలు, కొన్ని మరణాలు సంభవించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు రహదారి భద్రతలను పాటించాలని, ప్రమాదాలు జరగకుండా వాహనాలు నడపాలని మన వల్ల ఇతరులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలనీ యువతకు సూచించారు. ఈ తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన, హెల్మెట్ లేకుండా ప్రయాణించిన చలనాలు విధించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలనీ, అతి వేగం, అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశమని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, ఏపీఎస్పీ, సిఆర్పిఎఫ్ బెటాలియన్ యువత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్బిఐ ఖాతాదారులకు జీవిత బీమా, ప్రమాద బీమా సేవలు



**గంగవరం, (పబ్లిక్ వ్యూ) జనవరి 19:**ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన , ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన ద్వారా ఎస్బిఐ ఖాతాదారులకు జీవిత బీమా సౌకర్యాలను అందిస్తున్నట్లు గంగవరం ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ వెంకటరత్నం ,క్యాష్ ఆఫీసర్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు.
భీమా పథకాలపై స్థానిక ఎస్బిఐ బ్రాంచ్ లో ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో స్థానిక ఖాతాదారులకు భారతీయ స్టేట్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాలు, అటల్ పెన్షన్ యోజనల వివరాలు అవగాహన కల్పించారు. ప్రతి ఖాతాదారుడు ప్రమాద బీమా,జీవిత బీమాను అత్యంత తక్కువ ప్రీమియం సొమ్ముతో పొందగలుగుతారని వారు సూచించారు. స్థానిక ఖాతాదారుల సేవా కేంద్రం లో ఖాతాదారుల ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలతో నేరుగా వెళ్ళి ఈ పథకాలలో నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఎస్పీ సిబ్బంది రమేష్, మనీషా సంకురు దొర, అలాగే ఎస్బిఐ సిబ్బంది దేవరాజ్, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్ట్

**సీతానగరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19:**మండలంలోని చిన కోండేపూడి శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై డి. రామ్ కూమార్ సోమవారం తన సిబ్బందితో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 8600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందన్నారు. సీతానగరం మండల పరిధిలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## కాపవరం కుంతీదేవి ప్రధమ వార్షికోత్సవ మహోత్సవాలు..

### అమ్మవారి ఆలయానికి భారీగా భక్తులు..



**కోరుకొండ,(పబ్లిక్ వ్యూ) జనవరి 19**కోరుకొండ మండలం కాపవరం గ్రామ దేవత కుంతీదేవి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. సోమవారం ఉదయం భక్తులు గ్రామస్తులు చెరువు కెళ్ళి మట్టి తీసుకుని వచ్చి అమ్మవారిని తయారుచేసి మూడు రోజులు గ్రామోత్సవం జరుపుతారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ వేషధారణలో గ్రామం చుట్టూ తిరుగుతూ కోలాహలంగా అమ్మవారి మహోత్సవాలు జరుపుతారు. సంక్రాంతి నెలలో వచ్చే ఈ అమ్మవారి మహోత్సవానికి భక్తులు భారీ ఎత్తున పాల్గొని అమ్మవారి దర్శించుకుంటారు. ఈ కార్యక్రమంలో కాపవరం మాజీ సర్పంచ్ తెలగంశెట్టి శ్రీను,చింతపల్లి శ్రీను
నల్లల అర్జున్
గుండుపల్లి స్వామి
సబ్బితిఅక్కయ్య,మొకమాటి ధర్మరాజు గ్రామస్తులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాడేరులో డిసిసిబి చైర్మన్ కోన తాతారావు పర్యటన -- జనసేన నేతల మర్యాదపూర్వక భేటీ



**పాడేరు/గూడెం కొత్తవీధి (పబ్లిక్ వ్యూ) జనవరి 19:**జిల్లా సహకార కార్పొరేషన్ బ్యాంక్ చైర్మన్ కోన తాతారావు పాడేరులో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్, గూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కొయ్యం బాలరాజు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని ఈ సందర్భంగా అయన పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీతో పాటు కూటమి విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పాడేరు జనసేన పార్టీ ఇంచార్జ్, జనపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గుర్తిస్తారని ఆయన తెలిపారు.అలాగే ఈ సందర్భంగా జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ, ప్రతి మండల సహకార సంఘ బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు అందించడంలో జిల్లా చైర్మన్?గా అన్ని విధాల సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బ్యాంకులో ఖాతా తెరిచిన ప్రతి రైతుకు రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

# గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు

* ఐటీడీఏ పీఓ, జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్



**గంగవరం/ రంపచోడవరం(పబ్లిక్ వ్యూ) జనవరి 19**జిల్లాలోని గిరిజనుల భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు వేగవంతంగా చేపడుతున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయ హాలులో రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలు, భూ సమస్యలు, కొత్త డి-పట్టాల మంజూరు, భూ సేకరణ, వెబ్‌ల్యాండ్‌కు సంబంధించిన సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అర్హత ఆధారంగా సమస్యలను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్మరణ్ రాజ్ మాట్లాడుతూ పోలవరం జిల్లా రంపచోడవరం పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన మొత్తం మూడు సమస్యల దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిని సంబంధిత మండలాల తహసీల్దారులకు పంపించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుల అర్హతను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి వారం రెవెన్యూ శాఖకు వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే విషయాలను సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ నిరంతరం పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను నూతన పోలవరం జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు, వివిధ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు అంశంపై సంబంధిత అధికారులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, ఏపీఓ జనరల్ డీఎన్‌వి రమణ, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఎం.సావిత్రి, డిప్యూటీ తహసీల్దార్లు సరిత, శ్రీధర్, శివ, విలేజ్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

* ఐటిడిఏ గ్రీవెన్స్‌లో జేసీ బచ్చు స్మరణ్ రాజ్



**గంగవరం/ రంపచోడవరం(పబ్లిక్ వ్యూ) జనవరి 19 :**ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యల దరఖాస్తులను స్వీకరించి, వీలైన వాటిని వెంటనే పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటిడిఏ సమావేశపు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్‌తో పాటు ఏపీఓ (జనరల్) డీఎన్‌వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఎం. సావిత్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈ వారం మొత్తం 37 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి, దరఖాస్తుదారుల అర్హతల ఆధారంగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి కె. కోటేశ్వరరావు, జీసీసీ డీఎం జయశ్రీ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రకాశరావు, వివిధ శాఖల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## మదర్‌సా విద్యార్థినీలకు ధ్రువీకరణ పత్రాలు ప్రదానం

* ధార్మిక మార్గంలో నడవాలని మతపెద్దలు సూచన



**రాజమహేంద్రవరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19 :** ప్రతి ఒక్కరు ధార్మిక మార్గంలో నడిస్తే సమాజం శాంతి, సౌఖ్యాలతో విరాజిల్లుతుందని ముస్లిం పెద్దలు సూచించారు. బొమ్మూరు మదర్‌సా జామియా ఫాతిమా జనాతుల్ ఇస్లామ్‌లో ఖురాన్‌ను పూర్తిగా కంఠస్తం చేసిన 6గురు విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమం స్థానిక జెకె గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. బొమ్మూరు మదర్‌సా జామియా ఫాతిమా జనాతుల్ ఇస్లామ్ నిర్వాహకులు మౌలానా గులాం మొహిద్దిన్ రజ్వీ సాహెబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు . మహారాష్ట్రకు చెందిన ప్రముఖ ఇస్లాం ఆధ్యాత్మికవేత్త ముఫ్తి దులేఫికర్ అలి బర్కత్ ముఖ్య అతిధిగా పాల్గొని ఆధ్మాత్మిక సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, జానీలు మాట్లాడుతూ బొమ్మూరులోని మదర్‌సాలో 60 మంది విద్యార్థినులు ఖురాన్ పఠనం చేస్తున్నవారిలో ఖురాన్‌ను పూర్తిగా కంఠస్తం చేసిన 6గురు విద్యార్థినులకు పట్టా ప్రదానం చేయమన్నారు. ఈ మదర్‌సాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, యుపి, బీహార్‌ల నుండి కూడా వచ్చి చదువుకుంటు న్నారన్నారు. వీరంతా ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ ఖురాన్ బోధించే వారిగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. వీరికి ఉపాధి కల్పించే కుట్టు శిక్షణ అందించడతో పాటు , ఆరుగురు విద్యార్థినులకు ఉచితంగా కుట్టు మిషన్‌లను అందజేస్తున్నామన్నారు. తమకు సహకరించిన హోమి తజీమ్ సొసైటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సున్నీ తెగ మసీదుల ఇమామ్‌లు, మొహిద్దీన్‌లు, మసీదు , మహిళా కమిటీలు పెద్దఎత్తున హాజరయ్యారు.

## పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19:**ప్రజా గ్రీవెన్స్ లో అందిన అర్జీలు మళ్లీ రీఓపెన్ కాకుండా ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధికారులను ఆదేశించారు. సర్వే శాఖకు సంబంధించిన రీఓపెన్ కేసులు అధికంగా ఉన్నాయని, వాటిని అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ తో పాటు రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి, వాటిపై తక్షణ పరిశీలన చేపట్టారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మేఘా స్వరూప్ మాట్లాడుతూ, అన్ని అర్జీలను నిర్ణీత గడువులో, ఎస్ఎల్ఏ పీరియడ్‌లోపే నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీ పరిష్కారం అనంతరం తప్పనిసరిగా ఎండార్స్మెంట్ జారీ చేయాలని, క్షేత్రస్థాయిలో జారీ చేసే ఎండార్స్మెంట్లు నాణ్యతతో ఉండేలా హెచ్ఓడీలు పర్యవేక్షించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 147 అర్జీలు దరఖాస్తులు వచ్చాయన్నారు. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ 62, పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి (59), హోం శాఖ (9), వైద్య,ఆరోగ్య శాఖ తదితర శాఖల (17), అర్జీలు నమోదయ్యాయన్నారు. రెవెన్యూ క్లినిక్‌లో స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ (62) లో భూ ఆక్రమణ ఫిర్యాదులు , రికార్డ్ ఆఫ్ రైట్స్ (14), రీ సర్వే (11), 22(ఎ) జాబితా నుండి తొలగింపు అభ్యర్థనలు (8), రీ సర్వే ఫిర్యాదులు (6), అసైన్‌మెంట్లు, జనరల్ సర్వే, /మీ సేవ, ఎన్‌క్రోచ్‌మెంట్లు, దేవాదాయచౌల్ట్రీ పరిపాలన, ఎఫ్‌లైన్ (సరిహద్దు నిర్ధారణ) తదితర అంశాలకు చెందిన 23 అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, కె ఆర్ ఆర్ సి ఎస్డిసి కె భాస్కర్ రెడ్డి, ఎస్డీసీ వి. భాగ్యవతి, డీఎస్పీ భవ్య కిషోర్, డి ఎల్ డి వో పి వీణా దేవి, ఏ స్లివా రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## జనతా వారధి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి కృషి



**రాజమహేంద్రవరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19:**భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం కోసం బిజెపి జిల్లా నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలను పి జి ఆర్ ఎస్ లో కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చినట్లు బిజెపి జిల్లా నాయకులు తెలిపారు.

రాజమండ్రి కొవ్వూరు మధ్యఉన్న రోడ్ కం రైల్వే బ్రిడ్జి పైనుండి బస్సులు అనుమతి లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు . ఈ సమస్య పరిష్కరించే విధంగా సెక్యూరిటీ ఏర్పాటు చేసి బస్సులను పంపే విధంగా కృషి చేయాలని కోరారు. నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ని కోరామన్నారు . రాజమండ్రి రూరల్ సాటిలైట్ సిటీ ప్రాంతంలో పారిశుద్ధ్యం లోపించి ప్రజల తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరామన్నారు. తాళ్లపూడి మండలం రాగోలపల్లి గ్రామం పోలవరం పంచాయతీ గజ్జరం , రాగోపాలపల్లి తాడిపూడి మీదగా పోలవరం వెళ్ళుటకు కొవ్వాడ కాలువ మీదుగా వెళ్లే బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందన్నారు .క్రొత్త బ్రిడ్జి నిర్మాణానికి డిపిఆర్ పూర్తయినప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదని,

రైతులు, రైతు కూలీలకు ఈ వంతెన ఆవశ్యకమని ,వెంటనే నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, కార్యక్రమ ఇంచార్జ్ శివరామకృష్ణంరాజు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేష్ కుమార్ యాదవ్, రూరల్ రెండో మండల అధ్యక్షులు నాగబాబు, ఎన్ వి ఎన్ ఆచారి, లలిత్ జైన్, అత్తిలి పోసేశ్వరరావు, మన్నం శ్రీనివాస్, కందుకూరి మనోజ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం అధికారుల బాధ్యత


* పీజీఆర్ఎస్ లో 8 అర్జీలు స్వీకరించిన
* కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని కమిషనర్ రాహుల్ మీనా అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగా, 8 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో ఇంజనీరింగ్ విభానికి 4, రెవెన్యూ కి ఒకటి, టౌన్ ప్లానింగ్ కి 2, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి ఒకటి ఉన్నాయన్నారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని కమిషనర్ సూచించారు. ప్రతి అర్జీకి నాణ్యతతో పరిష్కార మార్గాలు చూపడం ద్వారా ప్రభుత్వ పనితీరు పట్ల అర్జీదారులలో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. మీకోసం పోర్టల్, 1100 టోల్‌ఫ్రీల ద్వారా వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామ లింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, అన్ని విభాగాల హెచ్ఓడీలు, అధికారులు పాల్గొన్నారు.

## న్యాయవాదులు మధ్యవర్తిత్వ శిక్షణాను సద్వినియోగం చేసుకోవాలి

* జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



**రాజమహేంద్రవరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19:**సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వ విధానాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయడంలో భాగంగా 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం , రాజీ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వ శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సివిల్ ప్రొసీజర్ కోడ్89 ప్రకారం వివాదాలను నాలుగు ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా పరిష్కరించే అవకాశం ఉందని, వాటిలో మధ్యవర్తిత్వం ఒక ముఖ్యమైన విధానమన్నారు. న్యాయాధికారులు ఒక కేసు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కార సాధ్యం అవుతుందని నిర్ధారించినప్పుడు, ఆ కేసులను మధ్యవర్తిత్వ కేంద్రానికి సిఫారసు చేయడం జరుగుతుందని గంధం సునీత తెలిపారు. నియమ నిబంధనల ప్రకారం జ్యుడీషియల్ అధికారి లేదా న్యాయవాదిని మధ్యవర్తిగా నియమించి, తదుపరి సమస్యలు తలెత్తకుండా సహేతుకమైన పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

లోక్ అదాలత్ ద్వారా సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, భూసేకరణ కేసులు, ఎగ్జిక్యూటివ్ కేసులు, మోటార్ వాహన ప్రమాదాలకు సంబంధించిన కేసులు పరిష్కారానికి అవకాశం ఉందని తెలిపారు. ఈ విధంగా కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా తిరిగి లభిస్తుందని చెప్పారు.

మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమైన కేసులపై తిరిగి అప్పీల్‌కు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దీనివల్ల కోర్టులపై 25 నుండి 50 శాతం వరకు భారం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నిజమైన కేసులను మాత్రమే మధ్యవర్తిత్వానికి తీసుకురావాలని, శిక్షణ పొందిన బృందానికి ఆయా కేసులు రిఫర్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఆమోదయోగ్యంగా, సామరస్యంగా వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. ఈ శిక్షణా ఈనెల 19 నుండి 23 వరకు "మధ్యవర్తిత్వం భావన, సాంకేతికతలు" అంశంపై తూర్పు గోదావరి జిల్లా న్యాయవాదుల కోసం, జిల్లా న్యాయ సేవల అథారిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపా రు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఎన్. శ్రీ లక్ష్మీ, మీడియేషన్ మాస్టర్ ట్రైనర్ (ఢిల్లీ) ఎస్. హెచ్. సురేందర్ సింగ్,

మీడియేషన్ మాస్టర్ ట్రైనర్ (కేరళ) పి. ఎం. మొహమ్మద్ షిరాజ్ , ఇతర న్యాయ మూర్తులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 35 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

## జిల్లా పశువైద్యాధికారి ఆధ్వర్యంలో ఐపోలవరంలో పశు వైద్య శిబిరం






**గంగవరం /రంపచోడవరం,(పబ్లిక్ వ్యూ) జనవరి 19:**జిల్లా పశువైద్యాధికారి (డీఏహెచ్ఓ) డాక్టర్ అహ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో పాడి రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఐపోలవరం పంచాయతీలో సోమవారం ప్రత్యేక పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు రైతులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో జిల్లావ్యాప్తంగా జనవరి 19 నుంచి 31 వరకు చేపట్టిన పశు వైద్య శిబిరాల ఏర్పాటులో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కుంజం వెంకటలక్ష్మి ప్రారంభించారు. డీఏహెచ్ఓ డాక్టర్ అహ్మద్ షరీఫ్‌తో పాటు పశు వైద్యాధికారులు డాక్టర్ జి.రికీ రాయ్, (విఏఎస్) డాక్టర్ గోపికా కుమార్ పాల్గొని పశువులకు వైద్య సేవలు అందించారు. పారా మెడికల్ సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు సమన్వయంతో సేవలందించారు. శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులను ఉచితంగా అందించారు. అలాగే అతి తక్కువ ప్రీమియంతో ఆవులు, గేదెలకు రూ. 149, గొర్రెలు, మేకలకు రూ. 27 చెల్లించి మూడు సంవత్సరాల కాలపరిమితి గల పశు బీమా పథకం గురించి రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి పశువుకు చెవిపోగు (ట్యాగ్) వేయించుకోవడం తప్పనిసరి అని, అలా చేసినప్పుడే ప్రభుత్వ పథకాలు, బీమా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని డీఏహెచ్ఓ డాక్టర్ అహ్మద్ షరీఫ్ స్పష్టం చేశారు. పాడి రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వైద్య సేవలు, బీమా పథకాలను పూర్తిగా వినియోగించుకుని తమ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కంగల మనోహర్, కంగల సూర్యారావు, పశువైద్య సిబ్బంది చిన్నారావు జేఈవో నీలకంటేశ్వరి, ఏహెచ్ఏలు వరప్రసాద్, బషీర్ బీబీ, తరుణ్, కనక, రామ్ నరేష్, నాగబాబు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని వైద్య ఖర్చుల కోసం రూ.1,85,600 విరాళం



**ఉంగుటూరు (పబ్లిక్ వ్యూ) జనవరి 19**నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న చేబ్రోలు గ్రామానికి చెందిన విద్యార్థిని చిలకంటి ఆశాజ్యోతి గత నెలలో జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్లకు బలమైన గాయాలు అయ్యాయి. ఆమె చికిత్స కోసం అవసరమైన వైద్య ఖర్చులను భరించేందుకు పాఠశాల యాజమాన్యం ముందుకొచ్చింది.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట పోతురాజు ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, దాతల సహకారంతో మొత్తం రూ. 1,85,600 విరాళాలు సేకరించారు. ఈ విరాళాలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి, ఏలూరు డివైఈవో రవీంద్ర భారతి చేతుల మీదుగా విద్యార్థిని తల్లికి అందజేశారు.

ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కూనె రాంబాబు తమ బంధుమిత్రుల సహకారంతో లక్ష రూపాయలకు పైగా విరాళాలు సేకరించగా, మిగతా మొత్తాన్ని నారాయణపురం హైస్కూల్ ఉపాధ్యాయులు సమకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు చేసిన సేవలు అమూల్యమని పలువురు ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని మానవతా దృక్పథానికి నిదర్శనంగా నిలిచారు.

# ఖర్జూరం, బాదం ఆరోగ్యానికి ఏది మంచిది?



**పబ్లిక్ వ్యూ డెస్క్:** చలికాలంలో ఆహారంపై మనం ప్రత్యేక శ్రద్ధ చూపడం చాలా అవసరం. ఎందుకంటే ఈ సీజన్‌లో మన శరీరంలో రోగనిరోధక శక్తి చాలా వరకు తగ్గిపోతుంది. తద్వారా మనం త్వరగా జబ్బుల భారీన పడుతాం ఇలా జరగకూడదంటే.. ఈ సీజన్‌లో మనం శరీరానికి శక్తినిచ్చే, వెచ్చగా ఉంచే, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడే ఆహారాలు తీసుకోవడం ముఖ్యం. ఈ విషయంలో, ఖర్జూరాలు, బాదం వంటి డ్రై ఫ్రూట్స్ చాలా ఆరోగ్యకరమైనవని నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరం, బాధం రెండు మన ఆరోగ్యానికి మేలు చేసేవే.. వీటిలో ఉండే పోషకాలు మన మొత్తం శరీరానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. మొదట ఖర్జూర వల్ల కలిగే ప్రయోజనాల గురించి చూసుకుంటే. వీటిలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు ఉంటాయి. శీతాకాలంలో వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ఇది జలుబుతో పోరాడటానికి సహాయపడుతుంది. డేలీ 2-3 ఖర్జూరాలు తినడం వల్ల అలసట తగ్గుటమే కాకుండా శరీరం చురుగ్గా ఉంటుంది. ఖర్జూరాలలో ఇనుము కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది శీతాకాలపు బలహీనత, హిమోగ్లోబిన్ లోపాన్ని నివారిస్తుంది. అలాగే ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అయితే, ఖర్జూరాలను మితంగా తీసుకోవాలి. వాటిలో చక్కెర అధికంగా ఉంటుంది, కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారు వాటిని అధికంగా తినకూడదు. బాదం తినడం వల్ల కూడా మన శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇవి ఖర్జురాలా తక్షణ శక్తిని ఇవ్వవు.. కానీ స్లోగా శరీరంలో ఎనర్జీ లెవెల్స్‌ను పెంచుతాయి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్ ఉంటాయి, ఇవి శీతాకాలంలో శరీరాన్ని బలంగా, వెచ్చగా ఉంచడంలో సహాయపడతాయి. బాదంలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది, ఇది చల్లని వాతావరణంలో పొడి చర్మాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అలాగే రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే బాదం జ్ఞాపకశక్తిని పెంచుతుంది. అంతేకాదు బాదం కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలా కూడా సహాయపడుతుంది. ఖర్జూరం లబ బాదం: చలికాలంలో ఈ రెండూ ఆరోగ్యకరమైనవే. ఒక వేళ ఈ సీజన్‌లో మీరు తరచూ బలహీనంగా, చలిగా లేదా అలసిపోయినట్లు అనిపిస్తే, మీకు ఖర్జూరం ఉత్తమమైనది. ఎందుకంటే అవి తక్షణ శక్తిని, వెచ్చదనాన్ని అందిస్తాయి. అయితే, మీరు దీర్ఘకాలిక బలం, రోగనిరోధక శక్తి, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటే బాదం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

# పచ్చి బఠానీలు.. పసుపు బఠానీలు ఏవి ఆరోగ్యానికి మంచివి?



**పబ్లిక్ వ్యూ డెస్క్:** పచ్చి, పసుపు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేసి ఇంటికి తీసుకురండి.పచ్చి లేదా పసుపు బఠానీలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. అయితే, శీతాకాలంలోనే ఎక్కువగా పచ్చి బఠానీలను మార్కెట్లో అమ్ముతారు. ఆ తర్వాత, మీరు ఏడాది పొడవునా ఎండబెట్టిన బఠానీలను మాత్రమే తినవచ్చు. పచ్చి బఠానీలను ఎండబెట్టిన తర్వాత, వాటిని పసుపు బఠానీల పేరుతో మార్కెట్‌లో కూడా అమ్ముతారు. ఎండబెట్టిన తర్వాత, పచ్చి బఠానీలు పసుపు రంగులోకి మారుతాయి. కానీ, కొన్నిసార్లు ఎండిన పచ్చి బఠానీలు కూడా మార్కెట్లో లభిస్తాయి. ఇది వేరే రకమైన బఠానీలు. ఎండబెట్టిన తర్వాత కూడా ఈ బఠానీలు పచ్చగా ఉంటాయి. రెండు రకాల పోషక విలువలు కూడా దాదాపు ఒకే విధంగా ఉంటాయి. అయితే, రెండు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేయాలి. వంట కోసం మీరు పచ్చి బఠానీలు లేదా పసుపు బఠానీలను ఉపయోగించవచ్చు. అయితే, వాటి రుచిలో స్వల్ప తేడా ఉంటుంది. పచ్చి బఠానీలు తక్కువ స్టార్చ్ కలిగి ఉంటాయి, పసుపు బఠానీల కంటే తియ్యగా ఉంటాయి. పసుపు బఠానీలు మట్టి, వగరు రుచిని కలిగి ఉంటాయి. అవి పచ్చి బఠానీల కంటే తేలికపాటివి, తక్కువ ఘాటుగా ఉంటాయి. మీ ఆహారంలో బలమైన బఠానీ రుచి ఉండకూడదనుకుంటే.. పసుపు బఠానీలు ఉత్తమం. రెండు రకాల ఎండిన బఠానీలు వండడానికి దాదాపు ఒకే సమయం పడుతుంది. ఆకుపచ్చ, పసుపు బఠానీలు రెండింటిలోనూ ప్రోటీన్, ఫైబర్, విటమిన్ బి, మెగ్నీషియం, ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. ఈ బఠానీలు కాల్షియం, జింక్, నియాసిన్, విటమిన్ ఇ, ఫోలేట్, పొటాషియం కోసం మీ రోజువారీ అవసరాలను తీర్చగలవు. బరువు తగ్గడానికి బఠానీలు ఒక అద్భుతమైన ఎంపిక. అవి జీర్ణక్రియకు సహాయపడతాయి. అవి ఆకలిని నియంత్రించడానికి, జీవక్రియను పెంచడానికి మంచివి. ఈ చిన్న బఠానీలు శక్తినిచ్చే పోషకాలను కలిగి ఉంటాయి. బఠానీలు వాపును తగ్గిస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి, రక్తపోటును నియంత్రిస్తాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. బఠానీలు తినడం వల్ల ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పసుపు బఠానీలను ప్రోటీన్ పౌడర్‌లో ఉపయోగిస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివిగా భావిస్తారు, కానీ పసుపు బఠానీలు పచ్చి బఠానీల కంటే కొంచెం ఖరీదైనవి.

## అవిసె గింజల పొడి ప్రయోజనాలు



**పబ్లిక్ వ్యూ డెస్క్:** కొన్ని గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇప్పుడున్న రోజుల్లో రకరకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే అవిసె గింజల పొడితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెబుతన్నారు నిపుణులు. అవిసె గింజలు ఒమేగా-3 కొవ్వులు, ఫైబర్, లిగ్నన్‌లను కలిగి ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. విత్తనాలను రుబ్బుకోవడం వల్ల బయటి పొర విచ్ఛిన్నమవుతుంది. తద్వారా శరీరం పోషకాలను బాగా గ్రహించగలుగుతుంది.
ప్రతిరోజూ 1 నుండి 2 టీస్పూన్లు తీసుకోవడం జీర్ణక్రియ, గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. గ్రౌండ్ ఫ్లాక్స్ సీడ్ లోని ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రోజుకు 30 గ్రాములు తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. లిగ్నన్లు మంటను తగ్గిస్తాయి. రక్త నాళాలలో ఫలకం ఏర్పడకుండా నిరోధిస్తాయి. అవిసె గింజల్లోని ఫైబర్ కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెరలో ఆకస్మిక హెచ్చుతగ్గులను నివారిస్తుంది. ప్రతిరోజూ రెండు టేబుల్ స్పూన్లు తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుందని పరిశోధనలో తేలింది. లిగ్నన్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.గ్రౌండ్ ఫ్లాక్స్ సీడ్‌లోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అలాగే గట్ బాక్టీరియాను సమతుల్యం చేస్తుంది. ఇది ఉబ్బరం, ఏఖాతో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. రోజువారీ వినియోగం ప్రేగు కదలికలను సులభతరం చేయడానికి, పెద్దప్రేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గ్రౌండ్ ఫ్లాక్స్ సీడ్ ఆకలి హార్మోన్లను తగ్గిస్తుంది. ఇది అతిగా తినకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. రోజువారీ వినియోగం కేలరీల తీసుకోవడం తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని కొవ్వు, ప్రోటీన్, ఫైబర్ రక్తంలో చక్కెరను స్థిరీకరించడానికి సహాయపడతాయి. అవిసె గింజల్లోని లిగ్నన్లు హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. మొటిమలు, పొడి చర్మాన్ని తగ్గిస్తాయి. ఒమేగా-3లు చర్మాన్ని లోపలి నుండి హైడ్రేట్ చేస్తాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం వృద్ధాప్యం, ఫ్రీ రాడికల్స్ ప్రభావాలను తగ్గిస్తుంది. పరిశోధన ప్రకారం.. అవిసె గింజలలోని లిగ్నన్లు అదనపు ఈస్ట్రోజెన్‌తో బంధించి రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఫైబర్ శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇది క్యాన్సర్‌కు నివారణ కానప్పటికీ, ఇది ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అవిసె గింజల్లోని ఫైటోఈస్ట్రోజెన్లు ఎముక సాంద్రతను కాపాడుకోవడానికి సహాయపడతాయి. అవిసె గింజల్లోని ఖనిజాలు విటమిన్ డి ప్రభావాలను పెంచుతాయి. అవిసె గింజలను తీసుకోవడం వల్ల ఎముక ఖనిజ సాంద్రత పెరుగుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

## ఖాళీ కడుపుతో బొప్పాయి తింటున్నారా?



ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఇది జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది, పేగులను శుభ్రపరుస్తుంది. బొప్పాయిలోని ఫైబర్ బరువును నియంత్రిస్తూ, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరిస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చు. ఉదయం మీ పేగులు సరిగ్గా శుభ్రం కాకపోతే, మీరు బొప్పాయిని క్రమం తప్పకుండా తినవచ్చు. ఇది పేగులలో పేరుకుపోయిన మురికిని శుభ్రపరుస్తుంది. తరచుగా జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఉదయం బొప్పాయి తినడం సహజ నివారణ. మీరు వేగంగా బరువు పెరుగుతున్నట్లయితే, ఈరోజు నుండి మీ ఆహారంలో బొప్పాయిని చేర్చుకోండి. ఇందులో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఫైబర్ ఆహారాన్ని నెమ్మదిగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. జీవక్రియను కూడా పెంచుతుంది. విటమిన్ సి ఉండటం వల్ల బొప్పాయి రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఇది జలుబు, దగ్గు, ఇతర ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. బొప్పాయి చర్మానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, ఇ, బీటా కెరోటిన్ చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల చర్మం తేమను నిర్వహిస్తుంది. మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. బొప్పాయితో చేసిన ఫేస్ ప్యాక్‌ను చర్మంపై అప్లై చేయడం వల్ల అనేక సమస్యలను నివారించవచ్చు. చర్మం మృదువుగా మారుతుంది. టానింగ్, ముడతలు తొలగిపోతాయి. ఇది జుట్టుకు పోషణను అందిస్తుంది. కాబట్టి ఇది జుట్టుకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. బొప్పాయి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ప్రసిద్ధి చెందింది. ఇందులో పొటాషియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తాయి. ఇది రక్తపోటును సమతుల్యంగా ఉంచుతుంది. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్పాహారానికి ముందు ఖాళీ కడుపుతో ఒక గిన్నె తాజా బొప్పాయి తినడం అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని మీ దినచర్యలో చేర్చుకోవడం ద్వారా, మీరు ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

## రోజూ నిమ్మకాయ నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదేనా..?



**పబ్లిక్ వ్యూ డెస్క్::** నిమ్మకాయ.. మన వంటింట్లో సులభంగా దొరికే అద్భుత ఔషధం. విటమిన్-సి, పొటాషియం, ఫ్లేవనాయిడ్లకు నిలయమైన నిమ్మరసాన్ని రోజూ తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అందరికీ తెలిసిందే. అయితే దీనిని ఎంతకాలం తాగాలి..? ఎప్పుడు తాగితే మంచిది..? ఆయుర్వేదం ఏం చెబుతోంది? జీర్ణక్రియకు - బరువు తగ్గడం: యలో ఉండే ఆమ్ల రసం వాత, కఫ దోషాలను తొలగిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. ఇది జీర్ణశక్తిని పెంచడమే కాకుండా శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపుతుంది. ముఖ్యంగా ఊబకాయం తగ్గాలనుకునే వారు 15 నుండి 21 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడి మంచి ఫలితాలు కనిపిస్తాయి.నెల రోజులు తాగితే: సాధారణ ఆరోగ్య ప్రయోజనాల కోసం 20-30 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవచ్చు. అయితే ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. ఒక నెల పాటు వరుసగా నిమ్మరసం తాగిన తర్వాత, కనీసం ఒక వారం పాటు విరామం ఇవ్వడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరం సహజ సమతుల్యతను కాపాడుకుంటుంది. రోజూ ఎంత తాగాలి? ఎలా తాగాలి?: శాస్త్రీయ కోణంలో చూస్తే నిమ్మరసం చాలా ఆరోగ్యకరమైన డ్రింక్. కానీ దీనిని పరిమితంగా తీసుకోవడమే క్షేమకరం. రోజుకు ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయను పిండుకుని తాగడం ఉత్తమం. గోరువెచ్చని నీటిని తీసుకుని, అందులో నిమ్మరసం కలిపి తాగాలి. రుచి కోసం కొద్దిగా తేనె కూడా కలుపుకోవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో లేదా భోజనానికి 30 నిమిషాల ముందు తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయి. ప్రయోజనాలు అనేకం: ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఇమ్యూనిటీని పెంచుతాయి. చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. శరీరంలో నీటి లోపాన్ని నివారిస్తుంది.

## బ్రోకలీ లేదా క్యాబేజీ బరువు తగ్గడానికి ఏది మంచిది?



**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఈ మధ్యకాలంలో చాలా మంది వెయిట్ లాస్ అవ్వాలని, ఫిట్‌గా కనిపించాలని అనుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేక డైట్స్ ఫాలో అవుతున్నారు. డైట్ చేసే సందర్భంలో ఆరోగ్యకరమైన ఆహారాలను ఎంచుకోవడం చాలా ముఖ్యం. అలాంటప్పుడు బ్రోకలీ, క్యాబేజీ వంటి క్రూసిఫెరస్ కూరగాయలు మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతాయి. వీటిలో మన శరీరానికి కావలసిన ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. చాలా మంది బ్రోకలీ అనే సరపేట్‌గా కూరగాయాల్లో ఒకటి అనుకుంటారు. కానీ బ్రోకలీ కూడా క్యాబేజీ కుటుంబానికి చెందిన ఆకుపచ్చ క్రూసిఫెరస్ కూరగాయ. జూఆం (యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్) డేటా ప్రకారం, 100 గ్రాముల బ్రోకలీలో సుమారు 34 కేలరీలు, సుమారు 89 గ్రాముల నీరు, 2.8 గ్రాముల ప్రోటీన్, చాలా తక్కువ కొవ్వు, 2.6 గ్రాముల ఫైబర్ మరియు 1.7 గ్రాముల సహజ చక్కెర ఉంటాయి. ఇంకా, బ్రోకలీ విటమిన్ సి, విటమిన్ కె ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తి పెంచడంతో పాటు ఎముకల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. బ్రోకలీలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లూకోసినోలేట్స్, సల్ఫోరాఫేన్ వంటి నిర్దిష్ట సల్ఫర్ సమ్మేళనాలు కూడా ఉన్నాయి, ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. బ్రోకలీలోని ఫైబర్, ముఖ్యంగా కరిగే ఫైబర్, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇంకా, ఫైబర్ కార్బోహైడ్రేట్‌లను నెమ్మదిగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర, ఇన్సులిన్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఇది డయాబెటిస్, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్యాబేజీలో పోషకాలు : క్యాబేజీ బ్రాసికా కుటుంబానికి చెందినది, ఇందులో బ్రోకలీ, కాలీఫ్లవర్, కాలే వంటి కూరగాయలు ఉంటాయి. జూఆం డేటా ప్రకారం, 100 గ్రాముల క్యాబేజీలో దాదాపు 25 కేలరీలు, దాదాపు 92 గ్రాముల నీరు, 1.2 గ్రాముల ప్రోటీన్, చాలా తక్కువ కొవ్వు, 2.5 గ్రాముల ఫైబర్ , 3.2 గ్రాముల సహజ చక్కెర ఉంటాయి. క్యాబేజీ విటమిన్ సి, విటమిన్ కె లకు కూడా మంచి మూలం, ఇవి రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా భావిస్తారు. బ్రోకలీ లేదా క్యాబేజీలో ఏది మంచిది?: పోషకాల పరంగా చూసుకుంటే క్యాబేజీ కంటే బ్రోకలీని ఎక్కువ పోషకాలు ఉంటాయి. అంటే ఇందులో ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు, వ్యాధి-రక్షణ సమ్మేళనాలు ఉంటాయి. క్యాబేజీలో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ బ్రోకలి కన్నా తక్కువగా ఉంటాయి. అయితే దీన్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం సులభం. బ్రోకలీ, క్యాబేజీ రెండూ ఆరోగ్యకరమైనవి. మీకు ఏది సరైనదనేది.. మీ అవసరాలు, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. మీకు ఎక్కవ పోషకాలు కావాలంటే బ్రోకలీ మీకు మంచిది. అయితే, క్యాబేజీని రోజువారీ భోజనాలకు ఆరోగ్యకరమైన ఎంపికగా భావిస్తారు.

## భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

**పబ్లిక్ వ్యూ డెస్క్:** అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూఈఎఫ్ సమావేశాల్లో భారత్‌కు సంబంధించి ఇది కీలకమైన చర్చనీయాంశం కానుంది. '2028 నాటికే ఈ మైలురాయిని చేరుకోవడానికి వృద్ధిని మరింత వేగవంతం చేయొచ్చా అనేది ముఖ్యమైన ప్రశ్న. ఇందుకోసం ప్రస్తుతం జీడీపీలో 15-17 శాతంగా ఉన్న తయారీ రంగాన్ని, 20% లేదా అంతకంటే ఎక్కువకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఈ లక్ష్యాన్ని సాధించడం ఎప్పుడూ అనే ప్రస్తావన ఉండదు' అని జైన్ పేర్కొన్నారు. శుద్ధ ఇంధనం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు వంటి వర్ధమాన రంగాల్లో పెట్టుబడులతో భారత్‌లో కొత్త వృద్ధి అవకాశాలు సృష్టించొచ్చని జైన్ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, వాహన విడిభాగాలు, పునరుత్పాదక ఇంధన, హార్డ్‌వేర్, డేటా కేంద్రాలు, సెమీకండక్టర్ వ్యవస్థలను విస్తరించడం ద్వారా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ మరింత చొచ్చుకువెళ్లొచ్చని అంచనా వేశారు.



మహిరా శర్మ: యూత్‌ఫుల్ ఆకర్షణ, పెరుగుతున్న స్టార్‌డమ్

# 100 కోట్లు.. బాలయ్య, నాగ్ నెక్ట్స్ ప్లాన్స్ తో సాధ్యమేనా?



టాలీవుడ్ సీనియర్ హీరోలు నందమూరి బాలకృష్ణ, కింగ్ నాగార్జున ఇప్పుడు తమ అప్ కమింగ్ మూవీస్ తో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా అఖండ 2: తాండవం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాలయ్య.. ఇప్పుడు డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే వారి కాంబోలో వీరసింహారెడ్డి సినిమా రాగా.. ఇప్పుడు మరోసారి కలిసి సినిమా చేస్తున్నారు.పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతున్న ఆ సినిమాలో బాలయ్య డ్యూయల్ రోల్ పోషిస్తున్నారు. రెండు పాత్రలకు సంబంధించిన లుక్స్ ఇప్పటికే రిలీజ్ అయ్యి.. మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై ఆడియన్స్ తోపాటు అభిమానుల్లో సూపర్ బజ్ క్రియేట్ చేశాయి. 2026 దసరాకు ఆ సినిమాతో బాలయ్య ప్రేక్షకుల ముందుకు రానున్నారని టాక్ వినిపిస్తోంది.అదే సమయంలో నాగార్జున ప్రస్తుతం తన 100వ సినిమా చేస్తున్నారు. చివరగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన కూలీ మూవీతో థియేటర్స్ లో సందడి చేసిన ఆయన.. ఇప్పుడు రా కార్తీక్ దర్శకత్వంలో కింగ్ 100 చేస్తున్నారు. యాక్షన్ ఫ్యామిలీ డ్రామాగా సినిమా ఉండనుందని తెలుస్తోంది. నాగ్ కెరీర్ లో ల్యాండ్ మార్క్ మూవీ కావడంతో అంతా భారీ అంచనాలు పెట్టుకున్నారు.అయితే ఇప్పుడు బాలయ్య, నాగ్ షూటింగ్స్ లో పాల్గొంటుండగా.. సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. వారిద్దరూ రూ.100 కోట్ల షేర్ మార్క్ ఎప్పుడు అందుకుంటారోనని అంతా మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే కెరీర్ లో కొన్ని వందల సినిమాలు చేసిన వారు.. రూ.100 కోట్ల షేర్ ను ఏ మూవీతో కూడా సాధించలేదు. కానీ టాలీవుడ్ కు చెందిన అనేక మంది హీరోలు ఆ ఘనత అందుకున్నారు.సీనియర్ హీరోల్లో చిరంజీవి, వెంకటేష్ తోపాటు ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్ సహా పలువురు రూ.100 కోట్ల షేర్ ను ఆయా చిత్రాలతో ఇప్పటికే సాధించారు. అందుకే ఇప్పుడు బాలకృష్ణ, నాగార్జున వంతు మాత్రమే మిగిలింది. దీంతో తమ అప్ కమింగ్ మూవీస్ తో వారిద్దరూ ఆ మార్క్ ను అందుకోవాలని అంతా కోరుకుంటున్నారు.నిజానికి బాలయ్య.. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి సినిమాలతో రూ.100 కోట్ల షేర్ దగ్గరకు వెళ్లి ఆగిపోయారు. నాగార్జున కూడా సేమ్ అంతే. ఆయన నటించిన సోగ్గాడే చిన్నినాయనా, బంగార్రాజు వంటి సినిమాలు రూ.70 కోట్ల షేర్ వరకు రాబట్టాయి. అందుకే ఇప్పుడు అప్ కమింగ్ మూవీలతో రూ.100 కోట్ల షేర్ మార్క్ ను నాగ్, బాలయ్య అందుకుంటారో లేదో అన్నది వేచి చూడాలి.



నుపుర్ సనన్ ఆమె హల్దీ వేడుకలో పసుపు రంగులో మెరుస్తుంది

## పొట్టి ఫార్మాట్‌పై ఫోకస్: ఇండియా, న్యూజిలాండ్ టీ20 సిరీస్.. షెడ్యూల్, స్క్వాడ్ వివరాలు ఇవే!



**పబ్లిక్ వ్యూ డెస్క్:** న్యూజిలాండ్ పై వన్డే ఫార్మాట్‌లో ఇండియా స్వదేశంలో తొలిసారి సిరీస్ ఓడిపోయింది. డారిల్ మిచెల్ (131 బాల్స్‌లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 137) , గ్లెన్ ఫిలిప్స్ (88 బాల్స్‌లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 106) అద్భుత సెంచరీలకు తోడు బౌలర్లూ రాణించడంతో హోల్కర్ స్టేడియంలో ఆదివారం (జనవరి 18) జరిగిన మూడో వన్డేలో కివీస్ 41 రన్స్ తేడాతో ఇండియాను ఓడించింది. ఫలితంగా సిరీస్‌ను 21తో సొంతం చేసుకుంది. తొలి వన్డేలో ఇండియా గెలిస్తే.. రెండు మూడు వన్డేల్లో న్యూజిలాండ్ జయభేరి మోగించింది. వన్డే సిరీస్ ముగియడంతో ఇప్పుడు ఫ్యాన్స్ అందరూ టీ20 సిరీస్ చూడాలని ఆతృత్తగా కనిపిస్తున్నారు. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టీ20 బుధవారం (జనవరి 21) జరగనుంది. వరల్డ్ కప్ ముందు ఇరు జట్లకు ఇదే ఇరు జట్లకు చివరి సిరీస్. జనవరి 21 నుంచి జనవరి 31 వరకు ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ జరగనుంది. ఇండియాకు సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీ చేయనున్నాడు. మరోవైపు న్యూజిలాండ్ జట్టును మిచెల్ సాంట్నర్ లీడ్ చేయనున్నాడు. ఇండియాపై సిరీస్ గెలుచుకున్న కివీస్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. మరోవైపు టీ20 ల్లో తిరుగులేకుండా దూసుకెళ్తున్న టీమిండియా సిరీస్ నెగ్గుతామనే ధీమాగా కనిపిస్తోంది. ఈ సిరీస్ షెడ్యూల్, రెండు జట్ల స్క్వాడ్ వివరాలు ఇప్పుడు చూద్దాం..

**ఇండియా, న్యూజిలాండ్ టీ20 షెడ్యూల్:**

బుధవారం (జనవరి 21): తొలి టీ20: విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం, నాగ్‌పూర్

శుక్రవారం (జనవరి 23): రెండో టీ20: షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియం, రాయ్‌పూర్

ఆదివారం (జనవరి 25): మూడో టీ20: బర్సపారా క్రికెట్ స్టేడియం, గౌహతి

బుధవరం (జనవరి 28): నాలుగో టీ 20:వైఎస్ రాజశేఖర రెడ్డి ACA`VDCA క్రికెట్ స్టేడియం, విశాఖపట్నం

శనివారం (జనవరి 31): ఐదో టీ20: గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం

**ఇండియా స్క్వాడ్:**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (తొలి మూడు టీ20లు), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకు సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్, ఇషాన్ కిషాన్

**న్యూజిలాండ్ స్క్వాడ్:**

మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, జాక్ ఫౌల్క్స్, మాట్ హెన్రీ, కైల్ జామిసన్, బెవాన్ జాకబ్స్, డారిల్ మిచెల్, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రాచిన్ రవీంద్ర, టిమ్ రాబిన్సన్, ఇష్ సోధి

## ఆరు నెలలు ఆగాల్సిందే: రోహిత్, కోహ్లీ కనిపించేది అప్పుడే.. టీమిండియా నెక్ట్స్ వన్డే షెడ్యూల్ ఇదే



**పబ్లిక్ వ్యూ డెస్క్:** టీమిండియా స్టార్ ప్లేయర్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మళ్ళీ ఎప్పుడు అంతర్జాతీయ క్రికెట్ లో కనిపిస్తారో అని ఫ్యాన్స్ ఎదురు చూపులు చూస్తున్నారు. రోకో జోడీ సూపర్ ఫామ్ లో ఉండడంతో వీరి ఆటను చూడడానికి ఫ్యాన్స్ తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ ఒకటే ఫార్మాట్ ఆడడంతో వన్డే షెడ్యూల్ పై ఎదురు చూడాల్సిన పరిస్థితి. తాజాగా న్యూజిలాండ్ తో జరిగిన సిరీస్ ను ఇండియా 1-2 తేడాతో ఓడిపోయింది. ఆదివారం (జనవరి 18) ఇండోర్ వేదికగా హోల్కర్ క్రికెట్ స్టేడియంలో ముగిసిన ఈ మ్యాచ్ లో 41 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. కివీస్ తో సిరీస్ ముగిశాక ఇండియా తర్వాత వన్డే షెడ్యూల్ ఏంటో ఫ్యాన్స్ తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారు. ఇండియా తర్వాత వన్డే షెడ్యూల్ జూలై లో ఇంగ్లాండ్ తో ఆడాల్సి ఉంది. భారత క్రికెట్ జట్టు 2026లో వైట్-బాల్ సిరీస్ కోసం ఇంగ్లాండ్‌లో టూర్ కు వెళ్లనుంది. ఇందులో భాగంగా మొత్తం 8 మ్యాచ్ లు ఆడనుంది. మొదట 5 టీ20 మ్యాచ్ లు ఆ తర్వాత 3 వన్డేలు జరగనున్నాయి. జూలై 14 నుంచి 19 మధ్య వన్డే సిరీస్ జరుగుతుంది. మూడు వన్డేలు బర్మింగ్‌హామ్, కార్డిఫ్, లండన్‌లో జరుగుతాయి. జూలై 4, జూలై 7, జూలై 9, జూలై 11 న వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు టీ 20 మ్యాచ్ లు జరుగుతాయి. మాంచెస్టర్, నాటింగ్ హోమ్, బ్రిస్టల్, సౌతాంప్టన్ వేదికలుగా ఈ మ్యాచ్ లు జరుగుతాయి.

ప్రస్తుతం ఇండియా న్యూజిలాండ్ తో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడడానికి సిద్ధంగా ఉంది. ఆ తర్వాత ఫిబ్రవరి లో టీ20 వరల్డ్ కప్ జరుగుతుంది. మార్చ్ నుంచి మే వరకు ఐపీఎల్ లో ప్లేయర్స్ బిజీ కానున్నారు. ఐపీఎల్ తర్వాత 2026 జూన్ లో ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ఉన్నట్టు చర్చలు నడుస్తున్నాయి. అయితే వీటి గురించి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. జూలై లో ఇంగ్లాండ్ తో ఇండియా తమ తదుపరి సిరీస్ ఆడడం ఖాయంగా మారింది. అంటే కోహ్లీ, రోహిత్ ను చూడడానికి మరో 6 నెలల పాటు ఆగాల్సిందే.

ఇటీవలే న్యూజిలాండ్ తో ముగిసిన వన్డే సిరీస్ లో రోహిత్ శర్మ పెద్దగా ఆకట్టులేకపోయాడు. మూడు మ్యాచ్ ల్లో వరుసగా 26, 24, 11 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అదే సమయంలో కోహ్లీ మాత్రం అద్భుతంగా రాణించాడు. సిరీస్ తొలి మ్యాచ్ లో కోహ్లీ 91 బంతుల్లో 93 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్‌లో 29 బంతుల్లో 23 పరుగులకు ఔటయ్యాడు. ఆదివారం (జనవరి 18) ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరిగిన చివరి వన్డేలో 108 బంతుల్లో 124 పరుగులు చేశాడు. ఓవరాల్ గా మూడు మ్యాచ్ ల్లో 80 యావరేజ్ తో 240 పరుగులు చేశాడు.

**ఇండియా, ఇంగ్లాండ్ 2026 వన్డే, టీ20 షెడ్యూల్:**

జూలై 14: మొదటి వన్డే - ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్, సాయంత్రం 5:30

జూలై 16: రెండవ వన్డే - సోఫియా గార్డెన్స్, కార్డిఫ్, సాయంత్రం 5:30

జూలై 19: మూడవ వన్డే - లార్డ్స్, లండన్, మధ్యాహ్నం 3:30

**టీ20 సిరీస్ షెడ్యూల్:**

జూలై 1: మొదటి టీ20 బ్యాంక్స్ హోమ్స్ రివర్‌సైడ్, డర్హామ్, రాత్రి 11 గంటలకు

జూలై 4: 2వ టీ20 - ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్, రాత్రి 7 గంటలకు

జూలై 7: 3వ టీ20 ట్రెంట్ బ్రిడ్జ్, నాటింగ్‌హామ్, రాత్రి 11 గంటలకు

జూలై 9: 4వ టీ20 - సీట్ యునిక్ స్టేడియం, బ్రిస్టల్, రాత్రి 11 గంటలు

జూలై 11: 5వ టీ20 యుటిలిటా బౌల్, సౌతాంప్టన్, రాత్రి 11 గంటలు

## ఇండియా, ఆస్ట్రేలియా కాదు.. వరల్డ్ కప్ గెలిచేది ఆ జట్టే: దిగ్గజ క్రికెటర్ జోస్యం






**పబ్లిక్ వ్యూ డెస్క్:** 2026 టీ20 వరల్డ్ కప్ ను భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్-నెదర్లాండ్ మధ్య జరగుతుంది. వరల్డ్ కప్ కు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటికే టీమిండియాతో పాటు దాదాపు అన్ని జట్లు వరల్డ్ కప్ కు తమ స్క్వాడ్ ను ప్రకటించేశాయి. వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి 20 జట్లు పోటీ పడుతుండడంతో ఈ మెగా టోర్నీకి భారీ హైప్ నెలకొంది. ఇండియా, ఆస్ట్రేలియా జట్లు ఈ మెగా టోర్నీలో ఫేవరేట్ గా బరిలోకి దిగుతున్నాయి. 2026 టీ20 వరల్డ్ కప్ ఇండియా లేదా ఆస్ట్రేలియా లేదా ఇంగ్లాండ్ గెలుచుకుంటుందని భావిస్తుంటే ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్ మైకేల్ వాన్ జోస్యం ప్రస్తుతం వైరల్ అవుతోంది. టీ20 వరల్డ్ కప్ ముందు మైకేల్ వాన్ మాట్లాడుతూ వరల్డ్ కప్ గెలిచే జట్టును చెప్పి కొంచెం ఆశ్చర్యానికి గురి చేశాడు. తాజాగా టీమిండియాకు షాక్ ఇచ్చి వన్డే సిరీస్ ను 2-1 తేడాతో గెలుచుకున్న న్యూజిలాండ్ జట్టు వరల్డ్ కప్ గెలవగలదని వాన్ అభిప్రాయపడ్డాడు. వాన్ ఎక్స్ లో ఇలా రాసుకొచ్చాడు. "న్యూజిలాండ్ టీ20 వరల్డ్ కప్ గెలవొచ్చు. ఆ జట్టులో ఎప్పుడూ బలమైన ప్లేయర్స్ ఉంటారు. ఈ సారి వరల్డ్ కప్ కొడుతుంది". అని వాన్ తన అభిప్రాయాన్ని తెలిపాడు. ఈ సారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి. భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

On behalf of Published and owned by CHIRIKI LOKESWARA RAO , Published at D.NO: 12-132, B.C. COLONY, VILLAGE PARAWADA, POST & MANDAL, ANAKAPALLI DIST, ANDHRA, ANDHRAPRADESH -531021. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, FLAT.NO: 504, BHARAT TOWERS, 5TH LANE, DWARAKA NAGAR, DISTRICT VISAKHAPATNAM, ANDHRAPRADESH-530018. Editor: CHIRIKI LOKESWARA RAO, (Responsible for selection of news under the PRB Act ) PRGI No: APTEL/2023/88653